వైభవం.. రథోత్సవం



కోదండరాముడి రథోత్సవం సందర్భంగా జనసంద్రంగా మారిన ఒంటిమిట్ట

- జనసంద్రమైన ఒంటిమిట్ట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి పండువెన్నెలలో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహిచారు. అనంతరం సీతారాములు గజవాహనంపై శుక్రవారం రాత్రి ఊరేగారు. శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు రథం స్థానిక బురుజు వద్ద ఆగింది. తిరిగి మూడు గంటలకు ప్రారంభమై 5 గంటలకు రథ ప్రాంగణానికి చేరుకున్నది. సీతారామ లక్ష్మణులు రథంపై అధిష్టించి గ్రామ వీధుల్లో విహరించారు. దారి పొడవునా చెక్కభజనలు, కోలాటాలు, భజన బృందాలు భజనలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి నీరాజనాలు అందించారు. కోదండరాముడి రథోత్సవం సందర్భంగా ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమంలో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సిబ్బంది నవీన్, అధికారులు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు



రథంలో ఊరేగుతున్న సీతారాములకు మొక్కుకుంటున్న భక్తులు

ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు 13వ స్థానం

- మొదటి సంవత్సరంలో 60 శాతం..
- ద్వితీయ సంవత్సరంలో 80 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ కళాశాలల్లో మెరిసిన ఆణిముత్యాలు





రాయచోటిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అధికారులు ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి సంవత్సరంలో 13,108 మంది విద్యార్థులు హాజరు కాగా 7,814 మంది విద్యార్థులు పాసై 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 11,486 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 9,175 మంది విద్యార్థులు పాసై 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ఒకేషనల్ మొదటి సంవత్సరం 991 మందికి 771 మంది పాసై 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 895 మందికి 702 మంది పాసై 78 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో 23వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 13వ స్థానంలో నిలిచింది. ఇందులో ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం 222 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 210 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 216 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 215 మంది విద్యార్థులు పాసయ్యారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 55 మందికి 53 మంది, ద్వితీయ సంవత్సరంలో 102 మందికి 97 మంది పాసయ్యారు. ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 513 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 411 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 434 మంది పరీక్ష రాయగా 383 మంది పాసయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 2,268 మందికి 1,247 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,037 మందికి 1,549 మంది పాసయ్యారు. హైస్కూల్ ప్లస్ మొదటి సంవత్సరంలో 333 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 80 మంది మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 66 మందికి 43 మంది మాత్రమే ఉత్తీర్ణతయ్యారు. కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 401 మందికి గానూ 290 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 289 మందికి 245 మంది పాసయ్యారు. మోడల్ స్కూల్ ఫస్టియర్ 1,520 మంది పరీక్ష రాయగా 1,036 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,074 మంది పరీక్ష రాయగా 905 మంది పాసయ్యారు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 7,648 మంది పరీక్ష రాయగా 4,355 మంది, ద్వితీయ సంవత్సరంలో 7,134 మందికి 5,607 మంది పాసయ్యారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 991 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 702 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 895 మందికి 702 మంది పాసయ్యారు. అయితే హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోయింది.

ఇదిలా ఉండగా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నాగజ్యోష్ణ 470కి 463, వైష్ణవి 500కు 472, మోనిష్ 470కి 462, బి.కొత్తకోట కళాశాల నుంచి హర్షవర్ధన్ 440కి 424, సాయికీర్తన 1000కి 957, గుర్రకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నబీద 1000కి 970, మదనపల్లె ప్రభుత్వ బాలికల కళాశాల నుంచి ఏబీ ఇక్రామ్ 1000కి 959, ఫిర్దోస్‌కు 1000కి 982 చొప్పున మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలల ప్రతిష్ఠను మరింత పెంచారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన అధ్యాపకులను ఇంటర్మీడియట్ విద్యా జిల్లా అధికారి కృష్ణయ్య అభినందించారు.

పట్టాభిరామమం.. పుష్పం సమర్పయామి

- వేడుకగా స్నపన తిరుమంజనం
- ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 12: వాల్మీకిపురం పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో వైభవంగా ముగిశాయి. చివరి రోజు శనివారం టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు ఆలయ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, విశేష భక్తజనం నడుమ స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. సాయంత్రం ఆలయంలో విశేషాలంకరణలతో తీర్చిదిద్దిన వేదికపై విశేషాలంకృతులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని ఆశీనులు గావించారు. టీటీడీ నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల పుష్పాలకు పూజలు నిర్వహించి పురవీధుల్లో ప్రదర్శన గావించారు. అనంతరం పట్టాభిరాముడి పుష్పయాగం ఘట్టం కన్నుల పండుగగా సాగింది. స్థానిక ప్రముఖులు పాల్గొనగా ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు పుష్పాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. పుష్పయాగంతో రాముడి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వైభవంగా ఉత్సవాలు నిర్వహించడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణరాజు భట్టార్, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్ భట్టార్, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాభిరాముడికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు



పుష్పాలను ప్రదర్శనగా తీసుకొస్తున్న టీటీడీ అధికారులు, అర్చకులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేది సోమవారం సెలవు రోజు కావడంతో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం) కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏపీ ప్రభుత్వం సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఫిర్యాదుదారులు ఎవ్వరూ ఇబ్బంది పడకుండా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి
- రెవెన్యూ తీరు మారాలి
- డీడీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి, చిత్రంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఆదర్శ రాజేంద్రన్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తదితరులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారు. అందులో భాగంగానే విజన్-2047 లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని అధికారులందరూ కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక సభాభవనంలో శనివారం ఉదయం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో రెవెన్యూ శాఖ పనితీరు మారాలని, కొంత మంది రెవెన్యూ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకనైనా అటువంటి ఉద్యోగులు పనితీరు మార్చుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా నూతనంగా ఏర్పడినప్పటికీ పింఛన్ల పంపిణీ, పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారం, జాబ్‌మేళాల నిర్వహణ, రీసర్వే, ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు, పల్లెపండుగ, సూక్ష్మనీటిపారుదల వంటి అనేక అంశాల్లో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. గత నెలలో సీఎంతో జరిగిన కలెక్టర్ల సదస్సులో మామిడి రైతులకు లబ్ధి చేకూర్చే అంశాన్ని కలెక్టర్ ముఖ్యమంత్రి ముందుంచారని, దాన్ని వెంటనే ఆయన రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడమని ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకు కలెక్టర్‌ను సభాముఖంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లు, మహిళల సంక్షేమం కోసం మూడు ఉచిత సిలిండర్లను ఇచ్చే దీపం 2.0 కార్యక్రమం, గుంతలు లేని రహదారులను నిర్మించేందుకు ప్రారంభించిన మిషన్ పాత్‌హోల్ ఫ్రీ కార్యక్రమం, ఉచిత ఇసుక పాలసీ తదితర ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. గత జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కలెక్టర్‌తో సమీక్షించి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.

రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల కాలంలోనే సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో వెలుగులు నింపడానికి పల్లెపండుగ కార్యక్రమంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు వివిధ రకాలైన 65 లక్షల పెన్షన్లు ఇస్తున్నామని, గత ప్రభుత్వం మాదిరి కాకుండా.. ఉచితంగా ప్రజలకు ఇసుకను ఇస్తున్నామని, రాయచోటి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో టమోటా, మామిడి సాగు ఎక్కువగా ఉండడంతో.. కోల్డ్‌స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని కోరారు.

కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖలు తీసుకున్న చర్యల కార్యాచరణ నివేదికను సభ్యులకు అందజేశామన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ.. జిల్లా సమగ్రాభివృద్ధికి అంకితభావంతో అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

వీరు పాల్గొన్నారు...

ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాం ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, అరవ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వీరు హాజరుకాలేదు...

ఈ సమావేశానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేదు. వైసీపీకి చెందిన తంబళ్లపల్లె, రాజంపేట ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు సమావేశానికి హాజరు కాలేదు.

ఈ అంశాలపై చర్చించారు

ఈ సమావేశంలో రెవెన్యూ, పీజీఆర్‌ఎస్, రీసర్వే-1, 2, వ్యవసాయ అనుబంధ శాఖలు, గ్రామీణ నీటి పారుదలశాఖ, గనులు, భూగర్భం, గృహనిర్మాణం డ్వామా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, పర్యాటకం, పాఠశాల విద్య, నైపుణ్యాభివృద్ధి, అటవీ, పరిశ్రమలు, టిడ్కో, చేనేత జౌళి, ఏపీఎస్‌పీడీసీఎల్, జాతీయ రహదారులు, జలవనరులు, డీఆర్డీఏ, పౌరసరఫరాలు, దీపం-2 మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ ప్రజారోగ్యం, సహకారం, ఎక్సైజ్, రవాణా సంక్షేమం, కార్పొరేషన్ల శాఖలపై చర్చించారు.

మూడేళ్లయినా అద్దె భవనాల్లోనే..



గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల భవనాల్లో కలెక్టరేట్ కార్యాలయం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లా పరిషత్ ఉమ్మడి కడపలోనే..
- పాలనపై ప్రభావం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రం ఏర్పడి ఈ నెల 4వ తేదీకి మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అయితే ఇప్పటికీ పలు కీలక శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అద్దె భవనాలు కావడంతో కొన్ని కార్యాలయాలు పట్టణంలో ఎక్కడో ఇరుకు వీధుల్లో ఉండగా మరికొన్ని పట్టణానికి దూరంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అదే సమయంలో ఇంకా జిల్లాలో పలు శాఖల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రత్యేకించి రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లా పరిషత్ ఇంకా ఉమ్మడి కడప జిల్లాలోనే ఉంది. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కడప జిల్లా పరిషత్ పరిధిలోనే ఉన్నాయి. పలు శాఖలు, సంస్థలు ఇంకా విభజన జరగలేదు. ఈ నేపథ్యంలో.. అధికారులకు పాలనా పరంగా ఇబ్బందులు ఎదరవుతున్నాయి.

గిరిజన సంక్షేమ పాఠశాలలో కలెక్టరేట్

కొత్తగా జిల్లా కేంద్రం ఏర్పడిన సమయంలో కడప రింగు రోడ్డుకు సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలలో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను రాజంపేట రోడ్డులోని ఓదివేడు వద్ద ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ భవనాల్లోకి తరలించారు. వైసీపీ ప్రభుత్వంలో అదిగో.. ఇదిగో వంద కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మిస్తాం.. ప్రజల సౌకర్యం కోసం.. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేసింది. రింగు రోడ్డుకు సమీపంలో సర్వే నెంబరు 971లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కోసం 70 ఎకరాల భూమిని కూడా కేటాయించింది. అయితే పైసా కూడా నిధులు కేటాయించలేదు. అగ్నిమాపక కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, ఐఅండ్ పీఆర్ కార్యాలయం, సివిల్ సప్లై కార్యాలయం, భూమి కొలతల కార్యాలయం, జిల్లా ముఖ్య ప్రణాళికా కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం, ఆడిట్ కార్యాలయం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం, జిల్లా డ్రగ్స్ కార్యాలయం, వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్ర కార్యాలయం, రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయం, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సంస్థ కార్యాలయం, జిల్లా గృహనిర్మాణ శాఖ కార్యాలయం, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, పర్యాటక శాఖ కార్యాలయం, జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఓదివీడు సమీపంలోని ప్రభుత్వ కళాశాలల సముదాయాలలో పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, క్రీడలు, డీఆర్‌డీఏ, సహకార సొసైటీ సంస్థ, జిల్లా పంచాయతీ కార్యాలయం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయాలు ఉన్నాయి.

అద్దె భవనాల్లో కీలక శాఖలు

జిల్లా కేంద్రంలో పలు కీలక శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాయచోటి-సుండుపల్లె మార్గంలో ఆర్టీసీ డిపో సమీపంలో ఓ ప్రైవేటు భవనంలో రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నడుస్తోంది. కొత్తపేట రామాపురంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాయలం నడుస్తోంది. ఎస్ఎన్ కాలనీలోని గవర్నర్ కల్యాణమండపం సమీపంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం, చిత్తూరు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జిల్లా గనులు, భూగర్భశాఖ కార్యాలయం, మాసాపేటలో సివిల్ సప్లై డీఎం కార్యాలయం, మాసాపేట జాతీయ రహదారిలో తూనికలు, కొలతల కార్యాలయం నడుస్తోంది. దేవదాయ శాఖ జిల్లా కార్యాలయం వీరభద్రస్వామి గుడి ప్రాంగణంలో అద్దె భవనంలో నడుస్తోంది. స్త్రీ శక్తి భవనం సుండుపల్లె రోడ్డులో, జిల్లా కార్మికశాఖ కార్యాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా అద్దె భవనంలో ఉన్నాయి. ఇంకా ఉమ్మడి జిల్లా నుంచి పలు శాఖలను విభజన చేయకపోవడంతో.. పలు శాఖల అధికారులు కడప నుంచి వారానికి ఓసారి రాయచోటికి వచ్చి వెళ్తున్నారు. జిల్లా పరిషత్ ఇప్పటికీ ఉమ్మడి కడప జిల్లాలోనే ఉండడంతో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కడప పరిధిలోనే ఉన్నాయి. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ మండలాలపై అధికారులు పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకున్నారనే చెప్పవచ్చు.



అద్దె భవనంలో తూనికలు, కొలతల కార్యాలయం

పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు కార్యాలయం

కడప-రాయచోటి మార్గంలోని రింగురోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పట్టణానికి దూరంగా ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 15 మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. కలెక్టరేట్‌లో నలుగురు తహసీల్దార్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంటు పోస్టులు కూడా చాలా ఖాళీగా ఉన్నాయి. హెచ్‌వోడీలు కూడా 31 శాతం మంది లేరు.

ఒంటిమిట్ట, సిద్దవటం.. రెండు జిల్లాల్లో

ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు కడప రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. అయితే ఈ రెండు మండలాలు రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. జిల్లా కేంద్రం ఏర్పాటు చేశారే కానీ.. ఆ మేరకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేవనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. మూడు సంవత్సరాలు గడుస్తున్నా. ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం.. అద్దెభవనాల్లో పాలన జరుగుతుండడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.



అద్దె భవనంలో గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

వృద్ధురాలి హత్య

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు





మృతి చెందిన గంగులమ్మ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చిల్లర అడిగిందన్న ఆగ్రహంతో ఓ వృద్ధురాలిని ఆటో డ్రైవర్ హత్య చేశాడు. తాలూకా ఎస్ఐ గాయత్రి కథనం మేరకు.. పట్టణంలోని బీకే పల్లి జెండా గుట్టకు చెందిన గంగులమ్మ (70) శనివారం ఉదయం ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేందుకు చంద్ర కాలనీ సమీపంలో షేర్ ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ విష్ణు ఆమెను ఆర్టీసీ బస్టాండులో కాకుండా సీఎస్ఐ చర్చి దగ్గర ఆమెను దింపేశాడు. దీంతో ఆమె అతనికి 20 రూపాయల నోటు ఇచ్చింది. అక్కడి వరకూ ఆటో చార్జీ 15 రూపాయలే కావడంతో మిగిలిన 5 రూపాయలు తిరిగి ఇవ్వాలని అడిగింది.అయితే, ఆటో డ్రైవర్ చిల్లర లేదంటూ మాట్లాడడంతో, ఐదు రూపాయలు ఇచ్చేవరకూ ఆటో దిగనంటూ ఆమె గొడవ చేసింది ఎంత చెప్పినా వినకపోవడంతో ఆటో డ్రైవర్ ఆమెను ఆటోలో రామాచారిపల్లె వద్ద నున్న చెరువుకట్ట వద్దకు తీసుకెళ్లి కొట్టి చంపేశాడు. ప్రమాదం జరిగిందని వృద్ధురాలివద్దనున్న ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ వెంకటరమణ, ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం తెలిసింది. ఆ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అటవీ ప్రాంతంలో వృద్ధురాలు...

- ఆలస్యంగా వెలుగులోకి

కురబలకోట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేనెకొండ అటవీ ప్రాంతంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ సింగన్నగారిపల్లెలో ఈశ్వరమ్మ(70) కూలి పనులు చేస్తుండేది. ఈమె భర్త ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందాడు. అనంతరం ఐదుగురు సంతానం కూడా మృతి చెందారు. దీంతో ఒంటరితనాన్ని భరించలేక ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. వారం రోజులు క్రితం కురబలకోట సమీపంలోని తేనెకొండ అటవీ ప్రాంతంలో ఉరేసుకుని మృతి చెందింది. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో ఆ మార్గాన వెళ్లే వారు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వితీయ ఇంటర్‌లో వందశాతం ఫలితాలు



ప్రతిభ చూపిన నిత్యశ్రీ, గంగోత్రి

పీలేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీఆర్‌జేసీ ఇంటర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలోని ఇంటర్ ద్వితీయ ఏడాది ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు చెందిన 113 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డా.చెన్నకేశవులు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 116 మందికి గానూ 114 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. ఎంపీసీ సెకండియర్‌లో పవన్ కుమార్ 986, సింహాద్రి 982, బైపీసీ సెకండియర్‌లో అబ్దుల్ సమీర్ 984, రోహిత్ 984, పవన్‌కుమార్‌రాజు 983, ఎంఈసీ సెకండియర్‌లో భరత్ 976, శ్రీకాంత్‌రెడ్డి 967 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో అజయ్ 467, సంతోష్ 463, బైపీసీలో హర్షవర్ధన్ 434, కార్తీక్ 433, ఎంఈసీలో నరేశ్ 480, లోకేశ్ 460 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అధ్యాపకులతో కలిసి అభినందించారు.

వగళ్ల కేజీబీవీలో: ద్వితీయ ఏడాది ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని కేవీపల్లె మండలం వగళ్లలోని కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రావణి తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఏడాదిలో తమ కళాశాల నుంచి 27 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, మొదటి సంవత్సరంలో 34 మందికి గానూ 32 మంది ఉత్తీర్ణులయ్యారని ఆమె వివరించారు. సీనియర్ బైపీసీలో నిత్యశ్రీ 961, గంగోత్రి 942, పల్లవి 928 మార్కులు సాధించారని ఆమె తెలిపారు. జూనియర్ బైపీసీలో నాగవేణి 417, శ్రావణి 411, దేవహర్షిణి 406 మార్కులు సాధించారని ఆమె తెలిపారు.

శోకసంద్రంలో రాచపల్లె

- లబోదిబోమంటున్న కుటుంబసభ్యులు
- చిన్నారుల మృతి దురదృష్టకరం
- ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి





చిన్నారులను మింగేసిన కుంట, రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

చిట్వేలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రాచపల్లె శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే ఊరికి చెందిన ముగ్గురు చిన్నారులు కుంటలో పడి మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాములోరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా పిల్లలంతా రంగువల్లులతో ఆనందోత్సాహాల మధ్య ఆడుకుంటున్నారు. పిల్లలు ఆలయం వద్ద ఉన్నారులే అనుకుని కుటుంబ సభ్యులు తాత్సారం చేశారు. చీకటి పడినా పిల్లలు రాకపోవడంతో గ్రామంలో వెతకడం మొదలుపెట్టారు. కానీ చేపలు పట్టేందుకు ఆ గ్రామ సమీపంలోని కుంటలోకి వెళ్లిన పిల్లలు నీటిలోకి దిగారు. లోతు తెలియని చొక్కరాజు దేవానంద్ (7), చొక్కరాజు జయ (7), రెడ్డిచర్ల యశ్వంత్‌రాజు (7)లు నీటిలో మునిగిపోయారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు కుంటలోకి వెళ్లి చూడగా శవాలుగా కనిపించడంతో లబోదిబోమన్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం అంత్యక్రియలు ముగిసే వరకు ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమయ్యారు.

కువైత్ నుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు

చిట్వేలి మండలం ఎం.రాచపల్లెలో జరిగిన ఈ ఘటనతో మృతులు జయ, యశ్వంత్‌రాజుల తల్లిదండ్రులు శేఖర్‌రాజు, వెంకటేశ్వర్‌రాజు కువైట్ నుంచి హుటాహుటిన బయలుదేరి ఇంటికి వచ్చారు. తమ కుమారులు మృతిచెందారన్న విషయన్న తెలుసుకున్నప్పటి నుంచి ఇంటికి వచ్చేదాక వారి పుత్ర శోకాన్ని ఆపడం ఎవరితరం కాలేదు. చొక్కా శేఖర్‌రాజు, విజయకు ముగ్గురు కుమారులు. వారిలో ఆఖరివాడు మృతి చెందిన జయ. రెడ్డిచర్ల వెంకటేశ్వర్‌రాజు, సుప్రజలకు కూడా ముగ్గురు కుమారులు. వారిలో ప్రమాదంలో మృతిచెందిన యశ్వంత్‌రాజు మొదటి బిడ్డ. ఆ రెండు కుటుంబాలు వ్యవసాయాధారంగా జీవించేవి. సేద్యంలో నష్టాలు రావడంతో వారు తమ భార్య, బిడ్డలను వదిలి కువైట్‌కు వలస వెళ్లారు. ఇక మృతిచెందిన చొక్కరాజు దేవానంద్ తండ్రి నరసింహరాజు దివ్యాంగుడు. భవన నిర్మాణ కార్మికుడైన ఆయన పక్షవాతంతో మంచాన పడ్డాడు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

చిన్నారుల మృతి దురదృష్టకరమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఖాదీ విలేజ్ బోర్డు ఇండస్ట్రీస్ స్టేట్ చైర్మన్ కేకే చౌదరిలు శనివారం ఉదయం బాధిత కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి ఓదార్చారు. చిన్న బిడ్డల మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్నివిధాల ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వ సహాయంతో పాటు తాము వ్యక్తిగత సహాయం కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలు రామాంజనేయులు, కాకర్ల లారీ సుబ్బరాయుడు, రాజుకుంట గుత్తి నరసింహులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రవికుమార్‌రాజు, జనసేన నాయకులు మాదాసు నరసింహులు, వెంకటేశ్‌రాజు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నూతన పట్టణాభివృద్ధి సంస్థలకే అధికారాలు

- టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరు నుంచి అధికారాలు బదిలీ

కలికిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో కొత్తగా ఏర్పాటైన పట్టణాభివృద్ధి సంస్థలకు అన్ని రకాల ఆమోదాలు జారీ చేసే అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా సాంకేతికపరమైన ఆమోదాలు జారీ చేసే అధికారం కట్టబెట్టడంతో ఇంతవరకూ ఉన్న పరిమితులు తొలగిపోయి వెసులుబాటు లభించింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), కడప పట్టణాభివృద్ధి సంస్థ (కుడా), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు ఎలాంటి సాంకేతిక ఆమోదాలు ఇచ్చే అధికారాలు లేకుండా, అప్పటి వైసీపీ ప్రభుత్వం 2019 జూలై 19న జీవో జారీ చేసి కట్టడి చేసింది. అన్ని రకాల అభివృద్ధి అంశాలకు సాంకేతిక ఆమోదం ఇచ్చే అధికారాన్ని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరుకు అప్పగించింది. దీని పైన ఒంగోలు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థల అధ్యక్షులు చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), కడప పట్టణాభివృద్ధి సంస్థ (కడప), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు అన్ని రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక ఆమోదాలు తెలియజేసే అధికారాలను కట్టబెట్టడంతో పాటు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రతిపాదనలను ఇక నుంచి నేరుగా సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలకే పంపుకోవచ్చు. దీంతో ఆయా ప్రాంతాల సబ్ రిజిస్ట్రార్లకు కూడా ఒక స్పష్టత వచ్చిందని చెబుతున్నారు. ఆయా సంస్థల పరిధిల్లోని మాస్టర్ ప్లాన్లను ఆమోదించుకునే వెసులుబాటు లభించింది. దీంతో పలురకాల ఆమోదాలు అవసరమైన రియల్ ఎస్టేట్ రంగాల వారు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి కూడా పెద్ద ఊరట లభించినట్లయింది.

పట్టణాభివృద్ధి సంస్థల పరిధిల్లో గందరగోళం

ఉమ్మడి కడప జిల్లా మొత్తానికి కడప-ఉడా ఒక్కటే కావడం వల్ల ఒకే పరిధి రావడంతో అక్కడ ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టత వచ్చింది. కానీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పలమనేరు- కుప్పం-మదనపల్లె (పీకేఎం-ఉడా) పరిధిలో గందర గోళం నెలకొంది. చుడాలో అన్నమయ్య జిల్లాకు చెందిన పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇదే చుడా పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలను చుడా నుంచి విడదీసి పీకేఎం-ఉడా పరిధిలోకి చేర్చారు. ఇక పీకేఎం-ఉడా పరిధిలో మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాలు, తంబళ్లపల్లె నియోజకవర్గం ఉన్నాయి. దీంతో ఒకే నియోజకవర్గంలో రెండు పట్టణాభివృద్ధి సంస్థలు ఉండటంతో పలు విషయాల్లో అయోమయం నెలకొందని చెబుతున్నారు.

పోక్సో కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన ఒకరిపై, కిడ్నాప్ అయ్యేందుకు సహకరించిన మరొకరిపై ఈ కేసు నమోదైనట్లు సీఐ నరసింహులు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వేంపల్లెకు చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను గాంధీరోడ్డులో చికెన్ దుకాణం నిర్వహించే ఆనంద్ వద్ద పనిచేస్తున్న ఫాజిల్ కిడ్నాప్ చేసి వేరే ఊరికి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇందుకు చికెన్ దుకాణ యజమాని సహకరించినట్లు ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మార్కెటింగ్ అవకాశాలు



కవర్లు కట్టిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనే డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మామిడికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ హరినాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి తెలిపారు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని ఆదర్శ రైతు రమణా రెడ్డి మామిడి తోట, సోలార్ డ్రైయర్ యూనిట్‌లను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌డీసీ ద్వారా డిజిటల్ కామర్స్‌ను మామిడి రైతులకు అందుబాటులో తెచ్చి చిన్న వ్యాపారులు కూడా పెద్ద వ్యాపారులతో పోటీ పడే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. కొనుగోలుదారులు, విక్రేతలు ఒకే నెట్‌వర్క్‌లో కనెక్ట్ అయి ఉండడం వల్ల కొనుగోలుదారులు ఉత్పత్తులు, ధరలు, డిస్కౌంట్లను పోల్చుగలుగుతారని వివరించారు. రైతులందరూ తప్పకుండా మామిడికి కవర్లు కట్టాలని, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఒక రైతుకు గరిష్ఠంగా 10 వేల కవర్లను 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. మామిడి కాయలు ఎగుమతి చేసే రైతులు 'అపెడా' వెబ్‌సైట్‌లో ఉద్యాన శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల రైతులు మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటే 35 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.10 లక్షల రాయితీ లభిస్తుందన్నారు. మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లతో మామిడికి సంబంధించిన మ్యాంగో పికిల్, ఆమ్‌చూర్, డ్రైడ్ మ్యాంగోస్, మ్యాంగో స్లైసెస్ లాంటివి మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 35 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.కోటి వరకు రాయితీ లభిస్తుందన్నారు. అనంతరం వారు పులిచెర్ల మండలం రామిరెడ్డిగారిపల్లెలోని రైతు ధర్మా రెడ్డి మామిడి తోటను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌వో సుకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టమోటా లారీ బోల్తా.. వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటరమణ

చిన్నమండెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం చెక్‌పోస్టు వద్ద టమోటా లారీ బోల్తా పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి సుండుపల్లె మండలం రాచపల్లికి చెందిన మంగిరి వెంకట్రమణ (51) కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉన్న కేశాపురం ఆంజనేయ స్వామి గుడి వద్ద వారి బంధువుల వివాహ కార్యక్రమానికి హాజరై మూత్రవిసర్జన కోసం బయటకు వచ్చారు. ఈ సమ యంలో గుర్రంకొండ మండలం తరిగొండ నుంచి టమోటాల లోడుతో నంద్యాలకు వెళుతున్న బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో వెంకట్రమణ ఆ లారీ కింద పడి మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమా రుడు, కుమార్తె కలరు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి కారు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

నందలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు వద్ద శుక్రవారం రాత్రి చెయ్యేరు వంతెన మీద టైరు పగలడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి పెనుప్రమాదం తప్పింది. కంభం నుంచి తిరుమలకు వెళుతున్న తోటకూరి నరేష్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా టైరు పగిలి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందరికి స్వల్పగాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.



కారు టైరు పగిలిన దృశ్యం



ఉపాధికి ఊతం

● జాతీయ పశుసంపద పథకం రైతులకు వరం ● 50 శాతం సబ్సిడీ
● యూనిట్‌స్థాయిని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం

మైలవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ పశుసంపద పథకం (నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్) ఊతంగా మారింది. పూర్తిగా ఆన్‌లైన్ దరఖాస్తులతో ముందుకు సాగే ఈ పథకంపై క్షేత్రస్థాయిలో పాడి రైతులకు, ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం గమనార్హం. గ్రామాల్లో, పట్టణాల్లో రైతులు ఏర్పాటు చేసే యూనిట్ స్థాయి, రైతు అర్హతను బట్టి రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు ఈ పథకం ద్వారా బ్యాంకు గ్యారెంటీతో రుణం పొందే అవకాశం కల్పించారు. ఇందులో ప్రభుత్వం రూ.50 శాతం సబ్సీడీ అందిస్తుండగా మిగిలిన 50 శాతం యూనిట్ ఏర్పాటు చేసిన రైతు చెల్లించాల్సి ఉంటుంది.

పథకం అమలు విధానం ఇలా..

పశుపోషణతోపాటు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి ఈ పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశాన్ని కల్పించారు. పశువుల పెంపకం, గొర్రెల పెంపకం యూనిట్లు, పశుగ్రాసం కొరత నివారించడానికి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విత్తనాల సరఫరా, మాంసం, గుడ్లు, ఉల్లి ఉత్పత్తిలో పరిశోధనలకు ప్రోత్సాహం తదితర యూనిట్లు ఉపాధి కల్పించే దిశగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం దరఖాస్తుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఎల్ఎం యూడీ వై ఎంఐఎంఐటీ ఆర్.ఐ.ఎన్‌వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రస్థాయి కమిటీ దీన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివిధ శాఖల అధికారులు క్షేత్ర పరిశీలన తర్వాత కేంద్ర కమిటీకి సిఫార్సు చేస్తారు. తర్వాత కేంద్ర ప్రభుత్వ అధికారులు దీన్ని పరిశీలించి నిధులు విడుదల చేస్తారు. ఈ పథకం కోసం దరఖాస్తుదారులు ఏ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ పథకానికి ఎంపికైనవారు ప్రతినెల పశుసంవర్ధకశాఖ అధికారులకు ఫొటోలు పంపాల్సి ఉంటుంది. పథకాన్ని దుర్వినియోగం చేయకుండా లబ్ధిదారుడి నుంచి గ్యారెంటీ పత్రాన్ని అధికారులు తీసుకుంటారు.

> **ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
>
> ఆసక్తి కలిగిన వారు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనలు అన్ని స్థాయిలో పరిశీలించి పథకాన్ని మంజూరు చేస్తారు. పాడిపరిశ్రమ వృత్తికి పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలి.
>
> \- శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి





గొర్రెల మంద

లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హతలు

ఈ పథకంలో గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల యూనిట్లతోపాటు పచ్చిమేత యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. చదువు, వయస్సుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పథకం పొందేవారు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. ఆధార్, డ్రైవింగ్‌లైసెన్స్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు వంటి గుర్తింపు కార్డులు స్థానికత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు మూడేళ్ల ఆదాయపన్ను రిటర్న్ పత్రాలు, ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, భూమి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఏర్పాటు చేయబోయే యూనిట్ మొత్తానికి సంబంధించిన నివేదిక వంటి పత్రాలను అందుబాటులో ఉంచుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

> **రైతులకు అవగాహన కల్పించాలి**
>
> జాతీయ పశుసంపద పథకం ఎంతో ప్రాధాన్యతమైంది. అయితే ఈ పథకంపై రైతులు, ఇతర వర్గాల్లో సరైన అవగాహన లేదు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం గురించి విస్తృత అవగాహన కల్పించాల్సి ఉంది.
>
> \- హనుమంతు, పాడి రైతు, మైలవరం

మద్యానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

● కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. కడప డిఅడిక్షన్ సెంటరులో శనివారం మద్యం బాధితులు, వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మద్యం దుష్ప్రభావాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి జిల్లాస్థాయి సీఏఆర్ఈ కమిటీని అధికారికంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో కలెక్టరు అధ్యక్షుడిగా, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కమిటీ కన్వీనరుగా వ్యవహరిస్తారు. పోలీసు, వైద్య ఆరోగ్య, సామాజిక సంక్షేమ, విద్య, హాస్పిటల్ ప్రిన్సిపాల్‌తో పాటు ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ఇద్దరు ప్రముఖులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, మానసిక నిపుణుల వైద్యులు డాక్టర్ వెంకటరాముడు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5లక్షల శాశ్వత విరాళం

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంఘం వీధిలో వెలసిన మంగళగౌరీదేవి పౌర్ణమి వేడుకల్లో అన్నదానం కోసం రూ.5,16,116 నగదు శాశ్వత విరాళంగా అందించారు. వేంపల్లెకు చెందిన నామా నారమ్మ, నామా చిన్నయ్యల కుమారుడు ఎన్ఆర్ఐ నామా నిత్యానంద్ శనివారం విరాళాన్ని బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్‌లకు అందజేశారు. అనంతరం అమ్మవారు గౌరీదేవికి పూజలు చేశారు. బలిజ సంఘం నాయకులు కొత్తూరు రెడ్డయ్య, యడాల రామచంద్ర, నామా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ కళాశాలల హవా



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాలల హవా కొనసాగిందని ఆ కళాశాలల టీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో బి.అంజలి 991 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే సంధ్య 988, పి.సుజన, ఎస్.నుర్స అంజాం, ఆత్రుత, జి.హరికిరణ్ 987 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో కె.మహబూబ్ అలీఖాన్, ఎస్.మహమ్మద్ అబ్దుల్లా, జ్యోత్స్నిని 988, ఖానం 987 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను కోర్ డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, డీన్లు సుబ్బారావు, బాల వెంకటరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్స్ అభినందించారు.


సత్తా చాటిన శ్రీచైతన్య అకాడమీ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాలయాజమాన్యం

ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య అకాడమీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారని కళాశాల డైరెక్టర్ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో నందిని 987 మార్కులు, బీబీ అనూష 985, రజిత 983, సాయిచరిత 983, వెంకటసాయి 982, విష్ణులోహిత, వైష్ణవి 980 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో అమీనా 984, అయేషా 976తో పాటు మరికొంతమంది ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో కూడా మంచి ఉత్తీర్ణత లభించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

సాయిరాం కళాశాల విద్యార్థుల విజయకేతనం



విజయకేతనం చూపుతున్న విద్యార్థులు

కడప నగరం శ్రీసాయిరాం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సీనియర్ ఎంపీసీలో సాయిశిరీష 978 మార్కులు, రోహిణి 977, స్పందన 972, ఫాతిమ 969, శరణ్య 968 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో త్రిభువన్ 990, తన్మశ్రీ 968, అబ్దుల్ రెహమాన్ 962, రఫియాతాజ్ 961, జ్యోతి 960 మార్కులు సాధించారన్నారు. అలాగే ప్రథమ సంవత్సర ఫలితాల్లో కూడా ఉత్తమ ఫలితాలు వచ్చినట్లు స్పష్టం చేశారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

పులివెందుల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో పాడా నిధులతో చేపట్టిన పనులపై శనివారం కూడా విజిలెన్స్ తనిఖీలు సాగాయి. శనివారం వేముల, వేంపల్లె మండలాల్లో ఈ తనిఖీలను రెండు బృందాలలు చేపట్టాయి. శనివారం విజిలెన్స్‌కు సంబంధించిన నాలుగు బృందాలలో రెండు బృందాలు మాత్రమే ఈ తనిఖీలు చేపట్టాయి. వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ, పాములూరు, గిడ్డంగివారిపల్లె, నందిపల్లె తదితర గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత పనుల పరిశీలన సాగింది. సీసీరోడ్ల నాణ్యతపై డ్రిల్ చేసి వాటి నమూనాలను సేకరించారు. అలాగే వేముల మండలంలోని వేముల, అమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత తనిఖీలు సాగాయి. పాడా నిధులతో జరిగిన పనులకు అప్పుడు తీసుకున్న కొలతల్లో ఏమైనా తేడాలున్నాయా అని పరిశీలించారు.

భారత మహిళా క్రికెట్ జట్టుకు శ్రీచరణి ఎంపిక గర్వకారణం



శ్రీచరణికి మెమెంటో ఇచ్చి అభినందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

కడప స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన ఎన్.శ్రీచరణి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. శ్రీలంకలోని కొలంబియాలో ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే ట్రై నేషన్స్ వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు ఎన్.శ్రీచరణి ఎంపికైన సంగతి తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా శనివారం నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచరణికి అభినందన సన్మానసభ నిర్వహించారు. తొలుత శ్రీచరణికి తిరుమలేశుని జ్ఞాపిక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా క్రికెట్‌ను, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంతగానో ప్రోత్సహిస్తుందని.. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీచరణి మాట్లాడుతూ భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికకావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగేశ్ కుమార్‌రాజు, సంయుక్త కార్యదర్శి సాయి పృద్వీతేజ, కోశాధికారి మహేంద్రరెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ స్టాక్ గోడౌన్లలో ఆకస్మిక తనిఖీలు



బఫర్ గోడౌన్లు, స్టాక్ పాయింట్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ మెహర సీతారాం

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): కడప సివిల్ సప్లైస్ స్టాక్ బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లను రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట మెహర్ సీతారాం సుధీర్ శనివారం తనిఖీ చేశారు. శనివారం కడపలో పర్యటించిన ఆయన రాష్ట్ర డైరెక్టర్ బి.శివ దత్తతో కలసి జిల్లా సివిల్ సప్లైస్ సంస్థ జిల్లా మేనేజరు కార్యాలయానికి చేరుకున్నారు. చైర్మన్‌కు ఆసంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజరు, సిబ్బంది పూల బొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ సీతారాంసుధీర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలు స్వీకరించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్ నుంచి స్టాక్ పాయింట్లకు లూజ్ బ్యాగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్లలో స్టాకింగ్ స్ప్రేయింగ్ సక్రమంగా లేకపోవడం పట్ల చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి డీఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపు విషయమై ఘర్షణ

● పరస్పర ఫిర్యాదులు... ఇరువురిపై కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక తరలింపు విషయమై టీడీపీకి చెందిన ఇరువురు ఘర్షణ పడ్డారు. వరుసకు బావ బామ్మర్దులు అయిన వీరు ఘర్షణకు పాల్పడటంతో ఇరువురికి గాయాలయ్యాయి. గురువారం రాత్రి వీరన్నగట్టుపల్లె వద్ద ఇసుక తరలించేందుకు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి వర్గానికి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర వెళ్లగా.. ఆయన బామ్మర్ది విజయ్‌కుమార్ (ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయుడు) వీడి యో తీస్తుండడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయపడ్డారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందారు. శనివారం ఇరువురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడు మృతి

దువ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐ.బోయనపల్లె సమీప కేసీ కాలువలో ప్రమాదవశాత్తు పడి జి.నరసింహరావు (28) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... తోటి మిత్రులతో కలిసి నరసింహా రావు కేసీ కాలువ వద్దకు వెళ్లాడు. మిగతా వ్యక్తులు ఈదులాడుతుండగా ఇతను గట్టుపై కూర్చొని ఉన్నాడు. కొద్దిసేపటికి కనిపించకపోవడంతో వెతుకులాట మొదలుపెట్టారు. ఆలస్యంగా శవమై కాలువలో కనపడ్డాడు. మృతుని తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

బ్యానరు కడుతూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఓ షాపింగ్‌మాల్‌కు సంబంధించి పాత బ్యానరు తొలగించి కొత్త బ్యానరు కడుతున్న సమయంలో కరెంటు వైర్లు తగలడంతో షాక్‌కు గురై కింద పడటంతో వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఉండడంతో చిన్నచౌకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు .. కడప నగరం సరోజినీనగర్‌కు చెందిన మూలతొట్టి కుమార్ (55) హోర్డింగులకు బ్యానర్లు కట్టే కాంట్రాక్టు తీసుకుని ఆ పనులు చేసుకుంటుండేవాడు. శనివారం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న షాపింగ్‌మాల్‌కు సంబంధించి బ్యానరు హోర్డింగుకు పాత బ్యానర్ తొలగించి కొత్త బ్యానరు కడుతున్న సమయంలో పైనున్న విద్యుత్ తీగలకు తగిలి షాకు గురై.. కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా బ్యానరు కట్టే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ కనెక్షన్లతో పాటు పలు వైర్లు ఎక్కవగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కన్నుల పండువగా ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం



ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి శనివారం ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో వేద మంత్రాలతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా.. అన్నప్రసాద వినియోగం చేశారు. రాత్రి స్వామివారిని హంసవాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. లయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌రెడ్డి



రాయచోటిలో రాజకీయ దొంగలు పడ్డారు

● మంత్రి అనుచరులు కంకరను అక్రమంగా దోచుకెళ్లారు

● ఫిర్యాదు చేసిన గంట వ్యవధిలోనే వాహనాల విడుదల

● మీడియా సమావేశంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో రాజకీయ దొంగలు పడ్డారని, తాను రోడ్డు నిర్మాణం కోసం నిల్వ ఉంచిన కంకరను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు రాత్రి సమయాల్లో జేసీబీలు, టిప్పర్లు పెట్టి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని వాహనాల నెంబర్లతో సహా వాహనాలను పోలీసులకు అప్పగిస్తే ఒక గంట వ్యవధిలోనే ఆ వాహనాలను స్టేషన్‌లో లేకుండా పంపించేశారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బెదిరించి డబ్బులు వసూలు చేయాలని, దోపిడీలు చేయాలని లోకేశ్‌బాబు రెడ్‌బుక్‌లో పెట్టాడా అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇసుకను, ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి పదినెలలైనా ఎటువంటి అభివృద్ధి చేయకపోగా ఎప్పుడు ఎవరు వచ్చి కబ్జా చేస్తారో అనే అభద్రతతో ప్రజలు ఉన్నారన్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నేతల సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయో అర్థం కావడం లేదన్నారు. కల్లబొల్లి హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నేతలు రెడ్డెయ్యయాదవ్, ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి కుటుంబంపై ఆరోపణలు తగదు'

రామాపురం/లక్కిరెడ్డిపల్లె/రాయచోటిటౌన్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మంత్రి కుటుంబ సభ్యులపైన ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి స్థాయికి తగదని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం వారు రామాపురంలో విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఎవరో మంత్రి పేరు చెప్పి కంకర తోలారని మంత్రి కుటుంబ సభ్యులపైన ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి రామకృష్ణగౌడ్, మండల నాయకుడు సురేందర్‌రెడ్డి, రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి బాలిశెట్టి చంద్రమౌళి, చెన్నక్రిష్ణారెడ్డి, సహదేవరెడ్డి, కృష్ణయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట్రమణ పాల్గొన్నారు. కాగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులపై నిందలు వేయడం తగదని లక్కిరెడ్డిపల్లెలోని టీడీపీ కార్యాలయంలో ఏఐసీసీ మాజీ చైర్మన్ యర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, మండల మైనార్టీ యువజన నాయకుడు షేక్ షరీఫ్ పేర్కొన్నారు. మంత్రిపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి రాయచోటి టీడీపీ నేతలు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌రెడ్డి, కొండారెడ్డి, గుడి రఘునాథ హితవు పలికారు. శనివారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

కమనీయంగా రాములోరి కల్యాణం

సుండుపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అగ్రహారంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే ఏటిగడ్డ రాచపల్లి రామాలయంలో, బూడిదేటిపల్లిలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు

రాయచోటిటౌన్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట రామాపురంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ జ్యోతి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు, అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుగవాసిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్కాపురం వెంకటేశ్వర్లు (చిట్టి), రత్నం, ఈశ్వరయ్య, బలరాం పాల్గొన్నారు.

రేపటి నుంచి అసర్ల గంగమ్మ తల్లి జాతర

గాలివీడు, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): పేరంపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు సమీపంలో వెలసిన అసర్ల గంగమ్మ తల్లి తిరునాళ్లు ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ 14న సిద్దలకూడు నైవేద్యంతో అంకురార్పణ చేసి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, రాత్రి చాందినీ బండ్ల గ్రామోత్సవం, 15న ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

నేడు నడివీధి గంగమ్మతల్లి జాతర

సిద్దవటం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పెద్దపల్లె గ్రామ పంచాయతీ భాకరాపేట గ్రామంలో ఈనెల 13వ తేదీ ఆదివారం నడివీధి గంగమ్మ తల్లి జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రతిఒక్కరు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

'తెలుగు' తమ్ముళ్ల అసంతృప్తి

● సమావేశానికి కొందరిని ఆహ్వానించడంపై అభ్యంతరం



కొందరికే అనుమతులు ఇవ్వడం పట్ల పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేతల సమావేశం కొందరి నేతల అసంతృప్తి మధ్య సాగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి, దీపకొరెడ్డి, రాజంపేట నియోజకవర్గ అబ్జర్వర్ దుర్గాప్రసాద్, పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి అందరూ రావాలని శుక్రవారం ఆహ్వానించారు. అయితే శనివారం సమావేశానికి కేవలం మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, రాష్ట్ర బాడీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు మాత్రమే హాజరు కావాలని, మిగిలినవారు బయటకు వెళ్లాలని చెప్పడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. అందరిని రమ్మని పిలిచి ఆ తర్వాత అనుమతించకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి ఇచ్చే గౌరవం ఇదేనా అని నిలదీశారు. ఆ తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసి పార్టీ అనుమతి ఇచ్చినవారిని మినహాయించి మిగిలినవారిని బయటకు పంపారు.

నేతలతో మంత్రి అంతర్గత సమావేశం


మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యులతో మంత్రి జనార్దన్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. అంతర్గతంగా నియోజకవర్గంలో పార్టీలో జరుగుతున్న అంశాలపై ఆరా తీశారు. వారి అభిప్రాయాలను సేకరించారు.

రాజంపేట సమస్యను పరిష్కరిస్తాం

ఈ సందర్భంగా విలేకరులతో ఇన్‌ఛార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో రాజంపేట నియోజకవర్గంలో టీడీపీలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితిని పరిష్కరిస్తామన్నారు. మహానాడు అనంతరం ఈ నియోజకవర్గ అంశంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అందరి అభిప్రయాలను తెలుసుకుని త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సాతుపల్లెలో ఇళ్లకు కొత్త నంబర్లు..?

పెనగలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు పంచా యతీ పరిధిలోని 1వ వార్డుకు సంబంధించి సాతుపల్లె గ్రామంలో ఓ వ్యక్తి ఇళ్లకు కొత్త నంబరు ప్లేట్లను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను ఒక్కో ఇంటి నుంచి రూ.40 వసూలు చేసినట్లు సమాచారం. కొత్త నంబర్లు ఏర్పాటు చేస్తున్న వ్యక్తి తాను జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి వచ్చినట్లు ఇళ్ల యజమానులకు చెబుతున్నాడు. ఈ విషయంపై ఎంపీడీవో విజయరావును వివరణ కోరగా తమకు సమాచారం ఇవ్వకుండా ఉన్నతాధికారులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టరని, దీని గురించి పూర్తిగా తెలియదన్నారు. ఈవోఆర్‌డీ హరిప్రసాద్‌ను వివరణ కోరగా కుల గణన, జనాభ గణన పూర్తి చేయకుండా ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టదని, తమకు తెలియకుండా ఇలాంటిది జరగడం ఆశ్చర్యంగా ఉందని, దీనిపై విచారిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఇది వాస్తవమైనదా లేదా అడ్డదారుల్లో డబ్బులు సంపాదించడానికి ఎవరో వేసిన ఎత్తుగడ అన్నది తెలియాల్సి ఉంది.



నంబరు ప్లేట్లను ఏర్పాటు చేస్తున్న వ్యక్తి

వైసీపీ నేతల భూ ఆక్రమణలపై ఫిర్యాదు

● చంద్రబాబును కలిసిన మండల నాయకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాల పాలనలో వైసీపీ నాయకులు భూ ఆక్రమణలు చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఎన్వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు ఎంవీ రమణ ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం టీటీడీ గెస్ట్‌హౌస్‌లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో వారు ముఖ్యమంత్రిని కలిశారు. మండలంలోని గంగపేరూరు, చిన్నచెరువు ఆక్రమణ గురించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. మండలంలోని పలు సర్వేనంబర్లలోని భూములను ఆక్రమించి పంటలను సాగు చేస్తున్నారని, వారి భూఆక్రమణలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. రామాలయ గర్భగుడి నుంచి కల్యాణవేదిక వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని టీటీడీలో విలీనం చేయాలన్నారు. ఒంటిమిట్టలో నడివీధి గంగమ్మతల్లి గుడిని టీటీడీ వారు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.

మద్యం మత్తులో బీరు సీసాతో గాయాలు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని శెట్టిగుంట పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన పల్లపు మణికుమార్ మద్యం మత్తులో బీరు సీసాతో తనుకు తానే గాయాలు చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. శనివారం మైసూరివారిపల్లి పంచాయతీ వద్ద ఉన్న మామిడికాయల యార్డ్ దగ్గర మద్యం దుకాణం ఆవరణలో అతిగా మద్యం తాగి బీరు సీసాతో శరీరంపై గాయాలు చేసుకున్నట్లు తెలిపారు. గమనించిన స్థానికులు 108వాహనంలో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

'టీటీడీ గోశాలపై అసత్య ప్రచారం తగదు'



మాట్లాడుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, చిత్రంలో పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలపై అసత్య ఆరోపణలు తగదని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజంపేట ఆర్ అండ్ బీ అతిథిగృహంలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ గోశాలలో వంద ఆవులు చనిపోయాయని వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. వయస్సు పైబడిన ఒకటి రెండు ఆవులు చనిపోతే ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. కరుణాకర్‌రెడ్డి హయాంలో టీటీడీని అన్నివిధాల భ్రష్టు పట్టించారన్నారు. రాయలసీమ టీడీపీ జోనల్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, పార్టీ పరిశీలకులు దుర్గాప్రసాద్, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర టీడీపీ అదికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మకు పొంగళ్లు

పెనగలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కొత్తపల్లె గ్రామంలో ఆదివారం గ్రామదేవత గంగమ్మతల్లికి పొంగుబాళ్ల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ముందుగా గంగమ్మకు పొంగుబాళ్లు పొంగించడం ఆనవాయితీగా వస్తుంది. ఆ క్రమంలోనే ఈ కార్యక్రమం తలపెట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలం రామయ్యపాళెం, తూర్పుపల్లె, రాఘవరాజపురం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఉపాధి కూలీలకూ కూలీ డబ్బులు అకౌంట్‌లో పడలేదన్నారు. ప్రభుత్వం సక్రమంగా ఉపాధి డబ్బులను చెల్లించడం లేదన్నారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పనులకు ఉపాధి కూలీలు వెళుతున్నా కనీసం ఆటో ఛార్జీలు కూడా ఇవ్వలేదన్నారు. వేసవి సౌకర్యాలు కల్పించాలని, రోజుకు కనీసం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ మహేశ్ అన్నారు. శనివారం స్థానిక ఓబులవారిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఆటో, జీపు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సు, యూనిఫాం ఉండాలన్నారు. మద్యం తాగి నడపరాదని, మహిళా పట్ల గౌరవంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాజంపేట నేతల భేటీ

రాజంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒంటిమిట్టలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు కలిశారు. తాము పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం ఎంతో కృషి చేశామని, కావున తమకు కార్పొరేషన్, ఇతర పదవుల్లో స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎన్వీ రమణ తదితరులు సీఎంను కలిసి తాము చేసిన సేవలపై వివరించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు తదతరులు పాల్గొన్నారు.

మంత్రికి రాజంపేట నేతల వినతి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జనార్దన్‌రెడ్డికి రాజంపేటకు చెందిన పలువురు నేతలు అనేక సమస్యలు వివరించారు. ప్రధానంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుంతనాయుడు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు కోర్టు కాంప్లెక్స్ భవనాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించారు.

రచ్చకెక్కిన తెలుగు తమ్ముళ్లు

● టీడీపీ రైల్వేకోడూరు కార్యాలయం వద్ద తోపులాట ● పలువురికి గాయాలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో శనివారం నిర్వహించిన టీడీపీ సమన్వయ సమావేశంలో తెలుగుతమ్ముళ్లు రచ్చకెక్కి తోపులాట జరిగింది. దీంతో టీడీపీ కార్యాలయం ముందు భాగం అద్దాలు ధ్వంసం చేశారు. ఈ సంఘటనలో పలువురు కార్యకర్తలతో పాటు పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ రాజు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, పార్టీ మండల అధ్యక్షుల సమన్వయ సమావేశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశం చర్చలకే పరిమితమైంది. ఇరు వర్గాలు పరస్పర వాగ్వాదాంతో జరగాల్సిన సమావేశం నాయకులతో ఒక్కొక్కరితో మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదటగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు పార్టీ కార్యాలయం వద్దకు వచ్చాడని తెలుసుకున్న రైల్వేకోడూరు ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి స్వయంగా వెళ్లి ఆహ్వానించారు. కేవలం క్లస్టర్, యూనిట్, మండల అధ్యక్షులు మాత్రమే లోపలికి అనుమతి ఉందని పోలీసులు చెప్పడంతో కొందరు కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదం చేశారు. కార్యాలయం అద్దాలతో పాటు కుర్చీలను పగులగొట్టారు. ముక్కా రూపానందరెడ్డి కార్యకర్తలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా వీలు కాలేదు. పోలీసులూ కంట్రోల్ చేయలేకపోయారు. ఈ సంఘటనపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆరా తీశారు. ఇదంతా జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి రాక మునుపే జరిగింది. ఈ నేపథ్యంలో మంత్రి ఒక్కొక్కరితో చర్చించారు. మొదటిగా కస్తూరి విశ్వనాథనాయుడుతో చర్చించగా ఆయన పలు విషయాలను విన్నవించారు. తర్వాత రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరితో నియోజకవర్గ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలపై చర్చించారు. జరిగిన సంఘటనపై అధిష్ఠానానికి వివరిస్తామని మంత్రి చెప్పినట్లు తెలిసింది. చర్చలు అనంతరం మీడియాతో మాట్లాడకుండా మంత్రి, దీపక్‌రెడ్డిలు కారెక్కి వెళ్లిపోయారు. అయితే కస్తూరి విశ్వనాథనాయుడు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల తర్వాత జరిగిన కొన్ని పరిణామాలపై కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని, పార్టీ అధిష్ఠానంతో చర్చించి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేస్తామన్నారు. ఇది ఇలా ఉండగా దౌర్జన్యానికి పాల్పడిన వారి పై కేసులు పెట్టడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.



మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి చర్చల వద్ద ఇరువర్గాలను సర్దుబాటు చేస్తున్న ముక్కా

ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న నలందా సీఏవో గుడారు విజయ్‌చంద్



రీజెన్సీ నలందా విద్యా సంస్థల జయభేరి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో జయభేరి మోగించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, కళాశాల అధ్యాపకులు, సిబ్బందిని రీజెన్సీ నలందా విద్యా సంస్థల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు అభినందించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో బి.శివలక్ష్మీ, జి.నవ్యశ్రీ 470కి 465 మార్కులు, ఇద్రిజ్ 470కి 464 మార్కులు, బైపీసీలో రుక్సానాబేగం 440కి 431 మార్కులు, సీఈసీలో కె.ధృతిక 500కు 471 మార్కులు సాధించగా.. సెకండియర్ ఎంపీసీ విభాగంలో 1000కి 987 మార్కులు, బైపీసీలో జె.మల్లిక, పి.తేజశ్విని 988 మార్కులు, సీఈసీలో ఎన్.సంధ్య 975 మార్కులు సాధించారని విద్యా సంస్థల సీఏవో గూడూరు విజయ్‌చంద్, ప్రిన్సిపాల్ సాధు సుబ్బరాయుడు తెలిపారు.

గీతాంజలి కళాశాలలో..

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో గీతాంజలి అత్యుత్తమ ఫలితాలను సాధించిందని కళాశాల చైర్మన్ ఎన్వీ రమణ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో డి.వైష్ణవి 1000కి 962 మార్కులు, సి.వెంకట అఖిల్ 955 మార్కులు, ఇ.ప్రియహాసిని 928 మార్కులు సాధించారన్నారు. ఫస్టియర్ ఎంపీసీలో జి.చరణ్‌తేజ 460 మార్కులు సాధించగా కళాశాల 95 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల చైర్మన్ అభినందించారు.

క్యూఎన్‌ఎక్స్, స్క్వేర్ టెక్నాలజీతో మిట్స్ ఎంవోయూ



ఒప్పందం కుదుర్చుకుంటున్న మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు

కురబలకోట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎంబెడెడ్ సిస్టమ్స్, ఆటోమేటివ్ సాఫ్ట్‌వేర్‌లను ప్రోత్సహించడంలో భాగంగా క్యూఎన్‌ఎక్స్, స్క్వేర్ టెక్నాలజీతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. శనివారం కళాశాలలో ఆ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్స్‌తో పాటు, అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థుల ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్ట్‌లు, పరిశోధనల ద్వారా విద్యార్థులకు విద్యామార్గాలను సుగమం చేయడంతో పాటు, ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. కాగా సాంకేతిక చొరవతో ప్రతిభావంతమైన అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటుగా విద్యాసంస్థ, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ద్రుపద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'జ్ఞానాంబిక' విజయం



విద్యార్థులను అభినందిస్తున్న జ్ఞానాంబిక జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియల్ పరీక్ష ఫలితాల్లో జ్ఞానాంబిక జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ బైపీసీలో షేక్ సాజియా 440 మార్కులకుగాను 435 మార్కులు, కె.తస్నీమియా 434 మార్కులు, ఎంపీసీలో ఎ. చందన 470 మార్కులకు 463, కె.హర్షవర్ధన్‌రెడ్డి 463, డి.రీతు 460, ఎంఎస్ తస్వీర్ 460 మార్కులు, ఎంఈసీలో గాయత్రి 500 మార్కులకుగాను 488, షేక్ సయ్యద్‌బాషా 482మార్కులు, జూనియర్ సీఈసీలో పి. హర్షిత 468,బి. వసుంధర 463 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సి.రెడ్డిసాయి దర్శన్ 1000 మార్కులకు 985, బి. ఈశ్వరేంద్రీజీ 984, సీనియర్ బైపీసీలో షేక్ నజియా 977, షేక్ షాహినా 976, సీనియర్ ఎంఈసీలో కెఎన్ లక్ష్మీనరసింహ 979, జి.అమని 978, సీనియర్ సీఈసీలో ఎస్ వైష్ణవి 979, మొగల్ హర్ష్ బేగం 955 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, చిన్నా, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత

సంబేపల్లె, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): శనివారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మండలంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, దేవపట్ల గురుకుల పాఠశాలల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాలల ప్రిన్సిపాళ్లు దిలీప్‌కుమార్, పద్మజ, కృష్ణవేణి తెలిపారు. దేవపట్ల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని హేమణి ఎంపీసీలో 959 మార్కులు, జీవితాంజలి బైపీసీలో 965 మార్కులు, మోడల్ స్కూల్ విద్యార్థిని ఆయేషా ఎంపీసీలో 924 మార్కులు, కేజీబీవీ విద్యార్థిని రాధా ఎంఈసీలో 913 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ దేవపట్ల విద్యార్థిని అఖిల ఎంపీసీలో 453/470, జీవితాంజలి బైపీసీలో 432/440, కేజీబీవీలో విద్యార్థిని పూర్ణిమ ఎంఈసీలో 433/500 మార్కులు సాధించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మూడేళ్లయినా అద్దె భవనాల్లోనే...

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లా పరిషత్ ఉమ్మడి కడపలోనే..
- పాలనపై ప్రభావం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రం ఏర్పడి ఈ నెల 4వ తేదీకి మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అయితే ఇప్పటికీ పలు కీలక శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అద్దె భవనాలు కావడంతో కొన్ని కార్యాలయాలు పట్టణంలో ఎక్కడో ఇరుకు వీధుల్లో ఉండగా మరికొన్ని పట్టణానికి దూరంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అదే సమయంలో ఇంకా జిల్లాలో పలు శాఖల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రత్యేకించి రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లా పరిషత్ ఇంకా ఉమ్మడి కడప జిల్లాలోనే ఉంది. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కడప జిల్లా పరిషత్ పరిధిలోనే ఉన్నాయి. పలు శాఖలు, సంస్థలు ఇంకా విభజన జరగలేదు. ఈ నేపథ్యంలో.. అధికారులకు పాలనా పరంగా ఇబ్బందులు ఎదరవుతున్నాయి.

గిరిజన సంక్షేమ పాఠశాలలో కలెక్టరేట్

కొత్తగా జిల్లా కేంద్రం ఏర్పడిన సమయంలో కడప రింగు రోడ్డుకు సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలలో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను రాజంపేట రోడ్డులోని ఓదివేడు వద్ద ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ భవనాల్లోకి తరలించారు. వైసీపీ ప్రభుత్వంలో అదిగో.. ఇదిగో వంద కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మిస్తాం.. ప్రజల సౌకర్యం కోసం.. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేసింది. రింగు రోడ్డుకు సమీపంలో సర్వే నెంబరు 971లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కోసం 70 ఎకరాల భూమిని కూడా కేటాయించింది. అయితే పైసా కూడా నిధులు కేటాయించలేదు. అగ్నిమాపక కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, ఐఅండ్ పీఆర్ కార్యాలయం, సివిల్ సప్లై కార్యాలయం, భూమి కొలతల కార్యాలయం, జిల్లా ముఖ్య ప్రణాళికా కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం, ఆడిట్ కార్యాలయం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం, జిల్లా డ్రగ్స్ కార్యాలయం, వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్ర కార్యాలయం, రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయం, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సంస్థ కార్యాలయం, జిల్లా గృహనిర్మాణ శాఖ కార్యాలయం, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, పర్యాటక శాఖ కార్యాలయం, జిల్లా చేనత, జౌళి శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఓదివీడు సమీపంలోని ప్రభుత్వ కళాశాలల సముదాయాలలో పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, క్రీడలు, డీఆర్‌డీఏ, సహకార సొసైటీ సంస్థ, జిల్లా పంచాయతీ కార్యాలయం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయాలు ఉన్నాయి.

అద్దె భవనాల్లో కీలక శాఖలు

జిల్లా కేంద్రంలో పలు కీలక శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాయచోటి-సుండుపల్లె మార్గంలో ఆర్టీసీ డిపో సమీపంలో ఓ ప్రైవేటు భవనంలో రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నడుస్తోంది. కొత్తపేట రామాపురంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాయలం నడుస్తోంది. ఎస్ఎన్ కాలనీలోని గవర్నర్ కల్యాణమండపం సమీపంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం, చిత్తూరు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జిల్లా గనులు, భూగర్భశాఖ కార్యాలయం, మాసాపేటలో సివిల్ సప్లై డీఎం కార్యాలయం, మాసాపేట జాతీయ రహదారిలో తూనికలు, కొలతల కార్యాలయం నడుస్తోంది. దేవదాయ శాఖ జిల్లా కార్యాలయం వీరభద్రస్వామి గుడి ప్రాంగణంలో అద్దె భవనంలో నడుస్తోంది. స్త్రీ శక్తి భవనం సుండుపల్లె రోడ్డులో, జిల్లా కార్మికశాఖ కార్యాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా అద్దె భవనంలో ఉన్నాయి. ఇంకా ఉమ్మడి జిల్లా నుంచి పలు శాఖలను విభజన చేయకపోవడంతో.. పలు శాఖల అధికారులు కడప నుంచి వారానికి ఓసారి రాయచోటికి వచ్చి వెళ్తున్నారు. జిల్లా పరిషత్ ఇప్పటికీ ఉమ్మడి కడప జిల్లాలోనే ఉండడంతో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కడప పరిధిలోనే ఉన్నాయి. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ మండలాలపై అధికారులు పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకున్నారనే చెప్పవచ్చు.



అద్దె భవనంలో తూనికలు, కొలతల కార్యాలయం

పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు కార్యాలయం

కడప-రాయచోటి మార్గంలోని రింగురోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పట్టణానికి దూరంగా ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 15 మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. కలెక్టరేట్‌లో నలుగురు తహసీల్దార్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంటు పోస్టులు కూడా చాలా ఖాళీగా ఉన్నాయి. హెచ్‌వోడీలు కూడా 31 శాతం మంది లేరు.

ఒంటిమిట్ట, సిద్దవటం.. రెండు జిల్లాల్లో

ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు కడప రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. అయితే ఈ రెండు మండలాలు రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. జిల్లా కేంద్రం ఏర్పాటు చేశారే కానీ.. ఆ మేరకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేవనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. మూడు సంవత్సరాలు గడుస్తున్నా. ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం.. అద్దెభవనాల్లో పాలన జరుగుతుండడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.



గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల భవనాల్లో కలెక్టరేట్ కార్యాలయం



అద్దె భవనంలో గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

వృద్ధురాలి హత్య

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు




మృతి చెందిన గంగులమ్మ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చిల్లర అడిగిందన్న ఆగ్రహంతో ఓ వృద్ధురాలిని ఆటో డ్రైవర్ హత్య చేశాడు. తాలూకా ఎస్ఐ గాయత్రి కథనం మేరకు.. పట్టణంలోని టీకే పల్లి జెండా గుట్టకు చెందిన గంగులమ్మ (70) శనివారం ఉదయం ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేందుకు చంద్ర కాలనీ సమీపంలో షేర్ ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ విష్ణు ఆమెను ఆర్టీసీ బస్టాండులో కాకుండా సీఎస్ఐ చర్చి దగ్గర ఆమెను దింపేశాడు. దీంతో ఆమె అతనికి 20 రూపాయల నోటు ఇచ్చింది. అక్కడి వరకూ ఆటో చార్జీ 15 రూపాయలే కావడంతో మిగిలిన 5 రూపాయలు తిరిగి ఇవ్వాలని అడిగింది.అయితే, ఆటో డ్రైవర్ చిల్లర లేదంటూ మాట్లాడడంతో, ఐదు రూపాయలు ఇచ్చేవరకూ ఆటో దిగనంటూ ఆమె గొడవ చేసింది ఎంత చెప్పినా వినకపోవడంతో ఆటో డ్రైవర్ ఆమెను ఆటోలో రామాచారిపల్లె వద్ద నున్న చెరువుకట్ట వద్దకు తీసుకెళ్లి కొట్టి చంపేశాడు. ప్రమాదం జరిగిందని వృద్ధురాలివద్దనున్న ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ వెంకటరమణ, ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం తెలిసింది. ఆ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అటవీ ప్రాంతంలో వృద్ధురాలు...

- ఆలస్యంగా వెలుగులోకి

కురబలకోట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేనెకొండ అటవీ ప్రాంతంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ సింగన్నగారిపల్లెలో ఈశ్వరమ్మ(70) కూలి పనులు చేస్తుండేది. ఈమె భర్త ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందాడు. అనంతరం ఐదుగురు సంతానం కూడా మృతి చెందారు. దీంతో ఒంటరితనాన్ని భరించలేక ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. వారం రోజులు క్రితం కురబలకోట సమీపంలోని తేనెకొండ అటవీ ప్రాంతంలో ఉరేసుకుని మృతి చెందింది. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో ఆ మార్గాన వెళ్లే వారు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వితీయ ఇంటర్‌లో వందశాతం ఫలితాలు


ప్రతిభ చూపిన నిత్యశ్రీ, గంగోత్రి

పీలేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీఆర్‌జేసీ ఇంటర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలోని ఇంటర్ ద్వితీయ ఏడాది ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు చెందిన 113 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డా.చెన్నకేశవులు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 116 మందికి గానూ 114 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. ఎంపీసీ సెకండియర్‌లో పవన్ కుమార్ 986, సింహాద్రి 982, బైపీసీ సెకండియర్‌లో అబ్దుల్ సమీర్ 984, రోహిత్ 984, పవన్‌కుమార్‌రాజు 983, ఎంఈసీ సెకండియర్‌లో భరత్ 976, శ్రీకాంత్‌రెడ్డి 967 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో అజయ్ 467, సంతోష్ 463, బైపీసీలో హర్షవర్ధన్ 434, కార్తీక్ 433, ఎంఈసీలో నరేశ్ 480, లోకేశ్ 460 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అధ్యాపకులతో కలిసి అభినందించారు.

వగళ్ల కేజీబీవీలో: ద్వితీయ ఏడాది ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని కేవీపల్లె మండలం వగళ్లలోని కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రావణి తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఏడాదిలో తమ కళాశాల నుంచి 27 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, మొదటి సంవత్సరంలో 34 మందికి గానూ 32 మంది ఉత్తీర్ణులయ్యారని ఆమె వివరించారు. సీనియర్ బైపీసీలో నిత్యశ్రీ 961, గంగోత్రి 942, పల్లవి 928 మార్కులు సాధించారని ఆమె తెలిపారు. జూనియర్ బైపీసీలో నాగవేణి 417, శ్రావణి 411, దేవహర్షిణి 406 మార్కులు సాధించారని ఆమె తెలిపారు.

శోకసంద్రంలో రాచపల్లె

- లబోదిబోమంటున్న కుటుంబసభ్యులు
- చిన్నారుల మృతి దురదృష్టకరం
- ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి




చిన్నారులను మింగేసిన కుంట, రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

చిట్వేలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రాచపల్లె శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే ఊరికి చెందిన ముగ్గురు చిన్నారులు కుంటలో పడి మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాములోరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా పిల్లలంతా రంగువల్లులతో ఆనందోత్సాహాల మధ్య ఆడుకుంటున్నారు. పిల్లలు ఆలయం వద్ద ఉన్నారులే అనుకుని కుటుంబ సభ్యులు తాత్సారం చేశారు. చీకటి పడినా పిల్లలు రాకపోవడంతో గ్రామంలో వెతకడం మొదలుపెట్టారు. కానీ చేపలు పట్టేందుకు ఆ గ్రామ సమీపంలోని కుంటలోకి వెళ్లిన పిల్లలు నీటిలోకి దిగారు. లోతు తెలియని చొక్కరాజు దేవానంద్ (7), చొక్కరాజు జయ (7), రెడ్డిచర్ల యశ్వంత్‌రాజు (7)లు నీటిలో మునిగిపోయారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు కుంటలోకి వెళ్లి చూడగా శవాలుగా కనిపించడంతో లబోదిబోమన్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం అంత్యక్రియలు ముగిసే వరకు ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమయ్యారు.

కువైత్ నుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు

చిట్వేలి మండలం ఎం.రాచపల్లెలో జరిగిన ఈ ఘటనతో మృతులు జయ, యశ్వంత్‌రాజుల తల్లిదండ్రులు శేఖర్‌రాజు, వెంకటేశ్వర్‌రాజు కువైట్ నుంచి హుటాహుటిన బయలుదేరి ఇంటికి వచ్చారు. తమ కుమారులు మృతిచెందారన్న విషయన్న తెలుసుకున్నప్పటి నుంచి ఇంటికి వచ్చేదాక వారి పుత్ర శోకాన్ని ఆపడం ఎవరితరం కాలేదు. చొక్కా శేఖర్‌రాజు, విజయకు ముగ్గురు కుమారులు. వారిలో ఆఖరివాడు మృతి చెందిన జయ. రెడ్డిచర్ల వెంకటేశ్వర్‌రాజు, సుప్రజలకు కూడా ముగ్గురు కుమారులు. వారిలో ప్రమాదంలో మృతిచెందిన యశ్వంత్‌రాజు మొదటి బిడ్డ. ఆ రెండు కుటుంబాలు వ్యవసాయాధారంగా జీవించేవి. సేద్యంలో నష్టాలు రావడంతో వారు తమ భార్య, బిడ్డలను వదిలి కువైట్‌కు వలస వెళ్లారు. ఇక మృతిచెందిన చొక్కరాజు దేవానంద్ తండ్రి నరసింహరాజు దివ్యాంగుడు. భవన నిర్మాణ కార్మికుడైన ఆయన పక్షవాతంతో మంచాన పడ్డాడు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

చిన్నారుల మృతి దురదృష్టకరమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఖాదీ విలేజ్ బోర్డు ఇండస్ట్రీస్ స్టేట్ చైర్మన్ కేకే చౌదరిలు శనివారం ఉదయం బాధిత కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి ఓదార్చారు. చిన్న బిడ్డల మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్నివిధాల ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వ సహాయంతో పాటు తాము వ్యక్తిగత సహాయం కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలు రామాంజనేయులు, కాకర్ల లారీ సుబ్బరాయుడు, రాజుకుంట గుత్తి నరసింహులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రవికుమార్‌రాజు, జనసేన నాయకులు మాదాసు నరసింహులు, వెంకటేశ్‌రాజు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నూతన పట్టణాభివృద్ధి సంస్థలకే అధికారాలు

- టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరు నుంచి అధికారాలు బదిలీ

కలికిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో కొత్తగా ఏర్పాటైన పట్టణాభివృద్ధి సంస్థలకు అన్ని రకాల ఆమోదాలు జారీ చేసే అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా సాంకేతికపరమైన ఆమోదాలు జారీ చేసే అధికారం కట్టబెట్టడంతో ఇంతవరకూ ఉన్న పరిమితులు తొలగిపోయి వెసులుబాటు లభించింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), కడప పట్టణాభివృద్ధి సంస్థ (కుడా), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు ఎలాంటి సాంకేతిక ఆమోదాలు ఇచ్చే అధికారాలు లేకుండా, అప్పటి వైసీపీ ప్రభుత్వం 2019 జూలై 19న జీవో జారీ చేసి కట్టడి చేసింది. అన్ని రకాల అభివృద్ధి అంశాలకు సాంకేతిక ఆమోదం ఇచ్చే అధికారాన్ని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరుకు అప్పగించింది. దీని పైన ఒంగోలు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థల అధ్యక్షులు చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), కడప పట్టణాభివృద్ధి సంస్థ (కడప), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు అన్ని రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక ఆమోదాలు తెలియజేసే అధికారాలను కట్టబెట్టడంతో పాటు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రతిపాదనలను ఇక నుంచి నేరుగా సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలకే పంపుకోవచ్చు. దీంతో ఆయా ప్రాంతాల సబ్ రిజిస్ట్రార్లకు కూడా ఒక స్పష్టత వచ్చిందని చెబుతున్నారు. ఆయా సంస్థల పరిధిల్లోని మాస్టర్ ప్లాన్లను ఆమోదించుకునే వెసులుబాటు లభించింది. దీంతో పలురకాల ఆమోదాలు అవసరమైన రియల్ ఎస్టేట్ రంగాల వారు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి కూడా పెద్ద ఊరట లభించినట్లయింది.

పట్టణాభివృద్ధి సంస్థల పరిధిల్లో గందరగోళం

ఉమ్మడి కడప జిల్లా మొత్తానికి కడప-ఉడా ఒక్కటే కావడం వల్ల ఒకే పరిధి రావడంతో అక్కడ ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టత వచ్చింది. కానీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పలమనేరు- కుప్పం-మదనపల్లె (పీకేఎం-ఉడా) పరిధిలో గందర గోళం నెలకొంది. చుడాలో అన్నమయ్య జిల్లాకు చెందిన పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇదే చుడా పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలను చుడా నుంచి విడదీసి పీకేఎం-ఉడా పరిధిలోకి చేర్చారు. ఇక పీకేఎం-ఉడా పరిధిలో మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాలు, తంబళ్లపల్లె నియోజకవర్గం ఉన్నాయి. దీంతో ఒకే నియోజకవర్గంలో రెండు పట్టణాభివృద్ధి సంస్థలు ఉండటంతో పలు విషయాల్లో అయోమయం నెలకొందని చెబుతున్నారు.

పోక్సో కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన ఒకరిపై, కిడ్నాప్ అయ్యేందుకు సహకరించిన మరొకరిపై ఈ కేసు నమోదైనట్లు సీఐ నరసింహులు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వేంపల్లెకు చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను గాంధీరోడ్డులో చికెన్ దుకాణం నిర్వహించే ఆనంద్ వద్ద పనిచేస్తున్న ఫాజిల్ కిడ్నాప్ చేసి వేరే ఊరికి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇందుకు చికెన్ దుకాణ యజమాని సహకరించినట్లు ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మార్కెటింగ్ అవకాశాలు


కవర్లు కట్టిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనే డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మామిడికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ హరినాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి తెలిపారు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని ఆదర్శ రైతు రమణా రెడ్డి మామిడి తోట, సోలార్ డ్రైయర్ యూనిట్‌లను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌డీసీ ద్వారా డిజిటల్ కామర్స్‌ను మామిడి రైతులకు అందుబాటులో తెచ్చి చిన్న వ్యాపారులు కూడా పెద్ద వ్యాపారులతో పోటీ పడే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. కొనుగోలుదారులు, విక్రేతలు ఒకే నెట్‌వర్క్‌లో కనెక్ట్ అయి ఉండడం వల్ల కొనుగోలుదారులు ఉత్పత్తులు, ధరలు, డిస్కౌంట్లను పోల్చుగలుగుతారని వివరించారు. రైతులందరూ తప్పకుండా మామిడికి కవర్లు కట్టాలని, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఒక రైతుకు గరిష్టంగా 10 వేల కవర్లను 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. మామిడి కాయలు ఎగుమతి చేసే రైతులు 'అపెడా' వెబ్‌సైట్‌లో ఉద్యాన శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల రైతులు మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటే 35 శాతం సబ్సిడీతో గరిష్టంగా రూ.10 లక్షల రాయితీ లభిస్తుందన్నారు. మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లతో మామిడికి సంబంధించిన మ్యాంగో పికిల్, ఆమ్‌చూర్, డ్రైడ్ మ్యాంగోస్, మ్యాంగో స్లైసెస్ లాంటివి మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 35 శాతం సబ్సిడీతో గరిష్టంగా రూ.కోటి వరకు రాయితీ లభిస్తుందన్నారు. అనంతరం వారు పులిచెర్ల మండలం రామిరెడ్డిగారిపల్లెలోని రైతు ధర్మా రెడ్డి మామిడి తోటను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌వో సుకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టమోటా లారీ బోల్తా.. వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటరమణ

చిన్నమండెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం చెక్‌పోస్టు వద్ద టమోటా లారీ బోల్తా పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి సుండుపల్లె మండలం రాచపల్లికి చెందిన మంగిరి వెంకట్రమణ (51) కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉన్న కేశాపురం అంజనేయ స్వామి గుడి వద్ద వారి బంధువుల వివాహ కార్యక్రమానికి హాజరై మూత్రవిసర్జన కోసం బయటకు వచ్చారు. ఈ సమ యంలో గుర్రంకొండ మండలం తరిగొండ నుంచి టమోటాల లోడుతో నంద్యాలకు వెళుతున్న బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో వెంకట్రమణ ఆ లారీ కింద పడి మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమా రుడు, కుమార్తె కలరు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి కారు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

నందలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు వద్ద శుక్రవారం రాత్రి చెయ్యేరు వంతెన మీద టైరు పగలడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి పెనుప్రమాదం తప్పింది. కంభం నుంచి తిరుమలకు వెళుతున్న తోటకూరి నరేష్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా టైరు పగిలి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందరికి స్వల్పగాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.


కారు టైరు పగిలిన దృశ్యం

ఉపాధికి ఊతం

- జాతీయ పశుసంపద పథకం రైతులకు వరం
- 50 శాతం సబ్సిడీ
- యూనిట్‌స్థాయిని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం



మైలవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ పశుసంపద పథకం (నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్) ఊతంగా మారింది. పూర్తిగా ఆన్‌లైన్ దరఖాస్తులతో ముందుకు సాగే ఈ పథకంపై క్షేత్రస్థాయిలో పాడి రైతులకు, ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం గమనార్హం. గ్రామాల్లో, పట్టణాల్లో రైతులు ఏర్పాటు చేసే యూనిట్ స్థాయి, రైతు అర్హతను బట్టి రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు ఈ పథకం ద్వారా బ్యాంకు గ్యారెంటీతో రుణం పొందే అవకాశం కల్పించారు. ఇందులో ప్రభుత్వం రూ.50 శాతం సబ్సీడీ అందిస్తుండగా మిగిలిన 50 శాతం యూనిట్ ఏర్పాటు చేసిన రైతు చెల్లించాల్సి ఉంటుంది.

పథకం అమలు విధానం ఇలా..

పశుపోషణతోపాటు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి ఈ పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశాన్ని కల్పించారు. పశువుల పెంపకం, గొర్రెల పెంపకం యూనిట్లు, పశుగ్రాసం కొరత నివారించడానికి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విత్తనాల సరఫరా, మాంసం, గుడ్లు, ఉల్లి ఉత్పత్తిలో పరిశోధనలకు ప్రోత్సాహం తదితర యూనిట్లు ఉపాధి కల్పించే దిశగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం దరఖాస్తుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఎల్ఎంయూడీ ఫై ఎఎంఐఎంఐటీఆర్ఏ.ఇన్‌వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రస్థాయి కమిటీ దీన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివిధ శాఖల అధికారులు క్షేత్ర పరిశీలన తర్వాత కేంద్ర కమిటీకి సిఫార్సు చేస్తారు. తర్వాత కేంద్ర ప్రభుత్వ అధికారులు దీన్ని పరిశీలించి నిధులు విడుదల చేస్తారు. ఈ పథకం కోసం దరఖాస్తుదారులు ఏ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ పథకానికి ఎంపికైనవారు ప్రతినెల పశుసంవర్ధకశాఖ అధికారులకు ఫొటోలు పంపాల్సి ఉంటుంది. పథకాన్ని దుర్వినియోగం చేయకుండా లబ్ధిదారుడి నుంచి గ్యారెంటీ పత్రాన్ని అధికారులు తీసుకుంటారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఆసక్తి కలిగిన వారు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనలు అన్ని స్థాయిలో పరిశీలించి పథకాన్ని మంజూరు చేస్తారు. పాడిపరిశ్రమ వృత్తికి పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలి.
- శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి



గొర్రెల మంద



రైతులకు అవగాహన కల్పించాలి

జాతీయ పశుసంపద పథకం ఎంతో ప్రాధాన్యతమైంది. అయితే ఈ పథకంపై రైతులు, ఇతర వర్గాల్లో సరైన అవగాహన లేదు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం గురించి విస్తృత అవగాహన కల్పించాల్సి ఉంది.
- హనుమంతు, పాడి రైతు, మైలవరం

లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హతలు

ఈ పథకంలో గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల యూనిట్లతోపాటు పచ్చిమేత యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. చదువు, వయస్సుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పథకం పొందేవారు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు వంటి గుర్తింపు కార్డులు స్థానికత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు మూడేళ్ల ఆదాయపన్ను రిటర్న్ పత్రాలు, ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, భూమి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఏర్పాటు చేయబోయే యూనిట్ మొత్తానికి సంబంధించిన నివేదిక వంటి పత్రాలను అందుబాటులో ఉంచుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మద్యానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

- కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్



డి అడిక్షన్ సెంటరును పరిశీలిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. కడప డిఅడిక్షన్ సెంటరులో శనివారం మద్యం బాధితులు, వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మద్యం దుష్ప్రభావాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి జిల్లాస్థాయి సీపీఆర్‌ఈ కమిటీని అధికారికంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో కలెక్టరు అధ్యక్షుడిగా, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కమిటీ కన్వీనరుగా వ్యవహరిస్తారు. పోలీసు, వైద్య ఆరోగ్య, సామాజిక సంక్షేమ, విద్య, హాస్పిటల్ ప్రిన్సిపాల్‌తో పాటు ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ఇద్దరు ప్రముఖులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎక్సైజ్ సీఐ క్రిష్ణకు మార్, మానసిక నిపుణుల వైద్యులు డాక్టర్ వెంకటరాముడు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి శనివారం ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో వేద మంత్రాలతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా.. అన్నప్రసాద వినియోగం చేశారు. రాత్రి స్వామివారిని హంసవాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5లక్షల శాశ్వత విరాళం

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంఘం వీధిలో వెలసిన మంగళగౌరీదేవి పౌర్ణమి వేడుకల్లో అన్నదానం కోసం రూ.5,16,116 నగదు శాశ్వత విరాళంగా అందించారు. వేంపల్లెకు చెందిన నామా నారమ్మ, నామా చిన్నయ్యల కుమారుడు ఎన్ఆర్ఐ నామా నిత్యానంద్ శనివారం విరాళాన్ని బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్‌లకు అందజేశా రు. అనంతరం అమ్మవారు గౌరీదేవికి పూజలు చేశారు. బలిజ సంఘం నాయ కులు కొత్తూరు రెడ్డయ్య, యడాల రామచంద్ర, నామా లక్ష్మీనారాయణ తదిత రులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో మళ్లీ ఉద్రిక్తత

- అన్నదమ్ముల మధ్య భూతగాదా
- దాడిలో ఇద్దరికి గాయాలు



పుంగనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రీకొడుకులు హరినాథ్, వెంకటేశ్



పుంగనూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో ఇటీవల జరిగిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య మరిచిపోకముందే శనివారం మళ్లీ టెన్షన్ నెలకొంది. గ్రామ సమీపంలో అన్నదమ్ముల మధ్య భూతగదా నేపథ్యంలో దాడి జరిగింది. స్వయానా తమ్ముడి తలపై కర్రతో దాడి చేసిన అన్న అడ్డొచ్చిన అతడి భార్య, కుమారుని కూడా గాయపరిచాడి. ఈ సంఘటన పుంగనూరు, నిమ్మనపల్లె మండల సరిహద్దులో జరిగింది. పోలీసుల కథనం మేరకు..

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ జాండ్లబైలుకు చెందిన ఎం.రామస్వామికి వేణుగోపాల్, హరినాథ్, మోహన్, మల్లిఖార్జున అనే కుమారులున్నారు. వీరికి 12.50 ఎకరాల భూములున్నాయి.హరినాథ్ చాలా కాలం క్రితం పుంగనూరు మండలం కృష్ణాపురానికి చేరుకుని అక్కడే ఉంటున్నారు. వీరి మధ్య కొంతకాలంగా ఆస్తి గొడవలతో పుంగనూరులో 4, నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. కాగా శనివారం కృష్ణాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలోని పొలం వద్ద ఎం.హరినాథ్ టమోటా పంటలో కర్రలకు జనుము పురి కట్టిస్తూ పొలంలోని గెనుము తెంచడం జరిగింది. తమ పొలంలోకి ఎందుకు వస్తారని, మల్చింగ్ పేపర్ ఎందుకు వేస్తారని జాండ్లబైలుకు చెందిన వేణుగోపాల్ కుమారుడు భరత్ ప్రశ్నించగా హరినాథ్ కర్రతో కొట్టాడు. ఈ విషయం వేణుగోపాల్‌కు ఫోన్‌లో భరత్ చెప్పాడు. పొలంలో పనిచేస్తున్న కూలీలకు మదనపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్ బోజనం తీసుకురాగా అప్పటికే పొలం వద్దకు చేరిన వేణుగోపాల్ వెదురుకర్రతో అతడి తలపై కొట్టాడు. దీంతో అతని తలకు గాయం కాగా పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించగా ఆరు కుట్లు పడ్డాయి. అలాగే హరినాథ్ భార్య కన్యాకుమారి, కుమారుడు వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇందులో ఎలాంటి రాజకీయకక్షలు లేవని, ముందస్తు ప్రణాళికతో దాడి జరగలేదని ఎస్ఐ లోకేశ్ తెలిపారు. దాడి విషయం తెలియగానే పుంగనూరు, నిమ్మనపల్లె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బాధితుల వద్ద ఆస్పత్రిలో స్టేట్‌మెంట్ రికార్డు చేసి పుంగనూరు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండు మండలాల సరిహద్దులో ఘటన జరగడంతో ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలియడంలేదని ఆదివారం రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయించి నిర్ణయిస్తామని ఎస్ఐ లోకేశ్ తెలిపారు. కృష్ణాపురంలో దాడి అనగానే ఉలిక్కిపడిన పోలీసులు విచారించగా చివరకు అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా అని తేలింది. ఇద్దరూ టీడీపీకి చెందిన వారేనని తెలుసుకున్నారు. డీఎస్పీ ప్రభాకర్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ సంఘటనపై పోలీసులు, టీడీపీ వర్గీయులతో మాట్లాడారు.డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ పుంగనూరు స్టేషన్‌లో ప్రతి మంగళవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నానని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సత్వరం చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భారత మహిళా క్రికెట్ జట్టుకు శ్రీచరణి ఎంపిక గర్వకారణం



శ్రీచరణికి మెమొంటో ఇచ్చి అభినందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

కడప స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన ఎన్.శ్రీచరణి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. శ్రీలంకలోని కొలంబియాలో ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే ట్రై నేషన్స్ వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు ఎన్.శ్రీచరణి ఎంపికైన సంగతి తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా శనివారం నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచరణికి అభినందన సన్మానసభ నిర్వహించారు. తొలుత శ్రీచర ణికి తిరుమలేశుని జ్ఞాపిక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా క్రికెట్‌ను, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంతగానో ప్రోత్సహి స్తుందని.. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీచరణి మాట్లాడుతూ భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికకావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగేశ్ కుమార్‌రాజు, సంయుక్త కార్యదర్శి సాయి పృధ్వీతేజ, కోశాధికారి మహేంద్రరెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ స్టాక్ గోడౌన్లలో ఆకస్మిక తనిఖీలు



బఫర్ గోడౌన్లు, స్టాక్ పాయింట్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ మెహర సీతారాం

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): కడప సివిల్ సప్లైస్ స్టాక్ బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లను రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట మెహర్ సీతారాం సుధీర్ శని వారం తనిఖీ చేశారు. శనివారం కడపలో పర్యటించిన ఆయన రాష్ట్ర డైరెక్టర్ బి.శివదత్తతో కలసి జిల్లా సివిల్ సప్లైస్ సంస్థ జిల్లా మేనేజరు కార్యాలయానికి చేరుకున్నారు. చైర్మన్‌కు ఆసంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజరు, సిబ్బంది పూల బొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ సీతారాంసుధీర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వ హించారు. అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలు స్వీకరించి సత్వరమే పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్ నుంచి స్టాక్ పాయింట్లకు లూజ్ బ్యాగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్లలో స్టాకింగ్ స్ప్రేయింగ్ సక్రమంగా లేకపోవడం పట్ల చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి డీఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపు విషయమై ఘర్షణ

- పరస్పర ఫిర్యాదులు... ఇరువురిపై కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక తరలింపు విషయమై టీడీపీకి చెందిన ఇరువురు ఘర్షణ పడ్డారు. వరుసకు బావ బామ్మ ర్దులు అయిన వీరు ఘర్షణకు పాల్పడటంతో ఇరువురికి గాయా లయ్యాయి. గురువారం రాత్రి వీరన్నగట్టుపల్లె వద్ద ఇసుక తరలిం చేందుకు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి వర్గానికి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర వెళ్లగా.. ఆయన బామ్మర్ది విజయ్‌కుమార్ (ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయుడు) వీడియో తీస్తుండడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయపడ్డారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందారు. శనివారం ఇరువురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడు మృతి



దువ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐ.బోయనపల్లె సమీప కేసీ కాలువలో ప్రమాదవశాత్తు పడి జి.నరసింహరావు (28) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తోటి మిత్రులతో కలిసి నరసింహా రావు కేసీ కాలువ వద్దకు వెళ్లాడు. మిగతా వ్యక్తులు ఈదులాడుతుండగా ఇతను గట్టుపై కూర్చొని ఉన్నాడు. కొద్దిసేపటికి కనిపించకపోవడంతో వెతుకులాట మొదలుపెట్టారు. ఆలస్యంగా శవమై కాలువలో కనపడ్డాడు. మృతుని తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

బ్యానరు కడుతూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

కడప క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఓ షాపింగ్ మాల్‌కు సంబంధించి పాత బ్యానరు తొలగించి కొత్త బ్యానరు కడుతున్న సమయంలో కరెంటు వైర్లు తగలడంతో షాక్‌కు గురై కింద పడటంతో వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరం సరోజినీనగర్‌కు చెందిన మూలతొట్టి కుమార్ (55) హోర్డింగులకు బ్యానర్లు కట్టే కాంట్రాక్టు తీసుకుని ఆ పనులు చేసుకుంటుండేవాడు. శనివారం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న షాపింగ్‌మాల్‌కు సంబంధించి హోర్డింగుకు పాత బ్యానర్ తొలగించి కొత్త బ్యానరు కడుతున్న సమయంలో పైనున్న విద్యుత్ తీగలకు తగిలి షాకు గురై.. కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా బ్యానరు కట్టే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ కనెక్షన్లతో పాటు పలు వైర్లు ఎక్కువగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

‘పాడా’ పనులపై కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు



అమ్మయ్యగారిపల్లెలో నాణ్యత పరిశీలించేందుకు డ్రిల్ చేయిస్తున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో పాడా నిధులతో చేపట్టిన పనులపై శనివారం కూడా విజిలెన్స్ తనిఖీలు సాగాయి. శనివారం వేముల, వేంపల్లె మండలాల్లో ఈ తనిఖీలను రెండు బృందాలలు చేపట్టాయి. శనివారం విజిలెన్స్‌కు సంబంధించిన నాలుగు బృందాలలో రెండు బృందాలు మాత్రమే ఈ తనిఖీలు చేపట్టాయి. వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ, పాములూరు, గిడ్డంగివారిపల్లె, నందిపల్లె తదితర గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత పనుల పరిశీలన సాగింది. సీసీరోడ్ల నాణ్యతపై డ్రిల్ చేసి వాటి నమూనాలను సేకరించారు. అలాగే వేముల మండలంలోని వేముల, అమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత తనిఖీలు సాగాయి. పాడా నిధులతో జరిగిన పనులకు అప్పుడు తీసుకున్న కొలతల్లో ఏమైనా తేడాలున్నాయా అని పరిశీలించారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

- గ్రామసచివాలయాలా.. వార్డు సచివాలయాలా?
- బిల్లుల చెల్లింపుపై సందేహాలు
- రూ. 60 లక్షలకు పైగా బకాయిలు
- భవనాలను అప్పగించని కాంట్రాక్టర్లు


నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాని 4వ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్

బి.కొత్తకోట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో బి.కొత్తకోట మండలంలో గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతుభరోసా కేంద్రాలకు 2020లో భవనాలు మంజూరయ్యాయి. హక్కులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బిల్లులు పెట్టించారు. నిర్మాణాలు పూర్తి చేసేశారు. 2021లో బి.కొత్తకోట గ్రామ పంచాయతీ రద్దై నగర పంచాయతీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో 30 శాతం చెల్లింపులు మిగిలి ఉండగానే ఆ వర్క్ ఐడీ రద్దైంది. పట్టణ పరిధిలోని తాకాటంవారిపల్లె, ఇందిరమ్మకాలనీ, 4వ సచివాలయం బిల్లులు చెల్లించడం సాధ్యం కాదని, మునిసిపల్ శాఖలో విలీనం అయినందున బిల్లులు వారే చెల్లించాలని పీఆర్ అధికారులు స్పష్టం చేశారు. దీనికి మునిసిపల్ అధికారులు ఒప్పుకోలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని 4వ సచివాలయానికి రూ.16లక్షలు, వెల్‌నెస్ సెంటర్ కు రూ.11లక్షలు, బీసీ కాలనీ సచివాలయ భవనానికి రూ.15 లక్షలు, తాకాటంవారిపల్లె సచివాలయ భవనానికి రూ.17లక్షలు బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. తమకు రావాల్సిన బిల్లులు ఇస్తేనే భవనాలను స్వాధీనం చేస్తామని కాంట్రాక్టర్లు తాళాలను తమ వద్దే ఉంచుకున్నారు. వీరిలో ఒకరు కోర్టును కూడా ఆశ్రయించారు. అయినా బిల్లులను మునిసిపల్‌శాఖ చెల్లించాలా.. పంచాయతీరాజ్ శాఖ ఇవ్వాలా అనే ధర్మసందేహం కొనసాగుతోంది. ఈ మూడు చోట్లా భవనాల నిర్మాణం పూర్తి అయినా అందుబాటులోకి రాక పురాతన, అద్దె భవనాలలోనే సచివాలయాలను నిర్వహిస్తున్నారు. దీనికి పరిష్కారం ఎంటి? ఎప్పుడు అని పట్టణ ప్రజలు, సచివాలయ సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి సుందరంగా నిర్మించిన భవనాలు ఎందుకు ప్రారంభానికి నోచుకోవడం లేదన్నది జనం సందేహం. రూ.లక్షలు పోసి కట్టినాం.. బిల్లులు ఎప్పుడు వస్తాయోనని కాంట్రాక్టర్ల ఆందోళన. ఈ శిథిల భవనంలో ఇంకెన్నాళ్లు .. నూతన భవనంలోకి మారేదెప్పుడు అంటూ సచివాలయ సిబ్బంది ఆవేదన. మాకు సంబంధం లేదంటూ జారుకుంటున్న అధికారులు.. వెరసి రూ.కోటికి పైగా ప్రజాధనం భవనాల రూపంలో వెక్కిరిస్తోంది.


ప్రారంభానికి నోచుకోని తాకాటంవారిపల్లె సచివాలయ భవనం


గుత్తేదారు అప్పగించని ఇందిరమ్మకాలనీ సచివాలయ భవనం

ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి..

నగరపంచాయతీ పరిధిలోకి వచ్చిన గ్రామ సచివాలయాల పెండింగ్ బిల్లుల అంశం మా పరిధిలో లేదు. స్పెషలాఫీసర్, ఆపై అధికారులు స్పందించాలి. పెద్దమొత్తం కాబట్టి మా పరిధిలో చేయగలిగింది ఏమీ లేదు. ఇది టెక్నికల్ సమస్య కాబట్టి ఏమీ చెప్పలేం . భవనాల అప్పగింతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-జీవీ పల్లవి, కమిషనర్, బి.కొత్తకోట

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటన నిమిత్తం రాయచోటికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డిని శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మదనపల్లె డీఎస్పీగా మహేంద్ర



మదనపల్లె అర్బన్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డీ ఎస్పీగా ఎస్ మహేంద్ర శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన విజయవాడ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. డివిజన్‌లో శాంతిభద్రతలను కాపాడడానికి కృషి చేస్తానని తెలిపారు. కింది స్థాయి ఉద్యోగులను క్రమశిక్షణలో ఉంచి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పని చేస్తున్న దర్బార్ కొండయ్యానాయుడు బదిలీపై సీఐడీకి వెళ్లిన విషయం తెలిసిందే.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

పెద్దమండ్యం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) చట్టం పరిధిలో చర్యలు తప్పవని మదనపల్లి కొత్త డీఎస్పీ ఎస్. మహేంద్ర హెచ్చరించారు. శనివారం కలిచెర్లలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్ల భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. డ్యాన్స్ ప్రోగ్రాంలు, అసాంఘిక కార్యాకలపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఆదివారం జరుగునున్న కలిచెర్ల పోలేరమ్మ తిరునాళ్లలో చాందినీ బండ్ల అనుమతులు, పోలీసు బందోబస్తు వివరాలను ములకలచెరువు సీఐ లక్ష్మన్న వివరించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ రమణ, ఏఎస్ఐ బాల చందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కందుకూరు రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు గ్రామంలో శనివారం పట్టాభిరామయ్య రథోత్సవం నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రథంలో ఆసీనులను చేశారు. మధ్యాహ్నం 12.47 నిమిషాలకు ప్రారంభమయిన రథోత్సవం సాయంత్రం వరకు కొనసాగింది. అన్నమయ్య జిల్లాతోపాటు, సత్యసాయి జిల్లా, కర్ణాటకలోని కోలారు, చిక్‌బళ్లాపూర్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కురబలకోట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఎర్రబల్లి పంచాయతీ కంటేవారిపల్లె సమీపంలో మదనపల్లె వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని కదిరి నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విచారించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మదనపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలి


మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పట్టణంలోని తాగునీటి పథకాలకు నీరందించే బోర్లు, భూగర్భ జలాల పరిస్థితిపై అధికారులను ఆరా తీశారు. సమస్యాత్మక బోర్లను డీపెనింగ్ చేయాలన్నారు. వేంపల్లె వాటర్ స్కీం బీకేపల్లె ప్రాంతాల్లోని బోర్ల నుంచి ప్రణాళిక బద్ధంగా పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులకు నీటిని సరఫరా చేసి, అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా ఇళ్లకు సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ, ఏఈ, ఫిట్టర్‌లు పాల్గొన్నారు.

'టీటీడీ పవిత్రత దెబ్బతీసేందుకు వైసీపీ కుట్ర'


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పవిత్రతను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్ర పన్నిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ విమర్శించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ గోశాలలో ఆవులు మృతి చెందాయని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కుల మతాల మధ్య విద్వేషాలను పుట్టిస్తున్నారన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసేందుకు ఆవులు చనిపోయాయంటూ టీటీడీ, ప్రభు త్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. క్రైస్తవ మతాభిమాని భూమన కరుణాకర్‌రెడ్డిని టీటీడీ చైర్మన్‌గా నియమించి వైసీపీ ప్రభుత్వం పెద్ద తప్పే చేసిందన్నారు. కమ్యూనిస్టు భావాలు గల వ్యక్తి నేడు సనాతన ధర్మం గురించి మాట్లాడడాన్ని ఎద్దేవా చేశారు. కేవలం టీటీడీ పేరు ప్రతిష్ఠలను భ్రష్టు పట్టించేకు తాడేపల్లె ప్యాలెస్ పంపిన స్క్రిప్టు చదువుతూ కరుణాకర్‌రెడ్డి డ్రామాలకు తెరలేపుతున్నారన్నారు. వైసీపీ పాలనలో టీటీడీ పాలనను భ్రష్టు పట్టించిన ఘనత వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిలకే చెల్లిందన్నారు. రాజన్న, జయ ప్రతాప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి


మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్

పెద్దమండ్యం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ పిలుపునిచ్చారు. శనివారం పెద్దమండ్యం మండలం వెలిగల్లు, కలిచెర్ల గ్రామాలలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పెద్దమండ్యంలో మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం దశల వారీగా హామీలు నెరవేరుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేర్చాలన్నారు. రైతు సమస్యలు పరిష్కారానికి జిల్లా అధికారులతో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు పాలపోగు నరసింహులు, మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ నాయకులు గాజుల శ్రీరాములు, ప్రభాకరరెడ్డి, చంద్రా యాదవ్, మస్తాన్, శివారెడ్డి, నందిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

ములకలచెరువు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప, వీసీకే పార్టీ నాయకుడు మంత్రాల రమణ డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యార్డు ఎదుట శనివారం వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్షాలు సూచించిన సవరణలు ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా పార్లమెంటు ఉభయ సభలను బుల్డోజ్ చేసి అర్ధరాత్రి సమయంలో వక్ఫ్ సవరణ బిల్లును అమోదించిన తీరు రాజ్యాంగ విరుద్ధమన్నారు. సవరణ బిల్లును రద్దు చేసి మత సామరస్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లికార్జున, నాయకులు చౌడప్ప, సుబ్బన్న, ఉత్తన్న, రెడ్డెప్ప, జయశంకర్, లక్ష్మీదేవి, అమరావతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌టీఏ కార్యవర్గ సమావేశం

పీలేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి గంగాధర్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. పీలేరులో శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సమావేశం జరుగుతుందన్నారు. పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏలు, ఇతర బకాయిలు, ఎబదిలీలు, ప్రమోషన్లు వంటి కీలక సమస్యలపై చర్చిస్తామన్నారు. చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంఎల్‌సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు పలువురు శాసనసభ్యులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బ్రహ్మన్న లేని లోటు తీరనిది : మాజీ సీఎం నల్లారి


బ్రహ్మపుత్రారెడ్డి భౌతిక దేహానికి నివాళులర్పిస్తున్న నల్లారి సోదరులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నల్లారి కుటుంబానికి ఆత్మీయుడు, వాల్మీకిపురం పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు చింతల బ్రహ్మపుత్రారెడ్డి(73) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిలు హైదరాబాద్ నుంచి శనివారం వాల్మీకిపురానికి చేరుకున్నారు. బ్రహ్మపుత్రారెడ్డి మృతదేహానికి నల్లారి సోదరులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి ఆత్మీయుడైన బ్రహ్మన్న లేని లోటు తీరనిదన్నారు. తన తండ్రి నల్లారి అమరనాథరెడ్డి కాలం నుంచి కూడా ఆయన రాజకీయాల్లో తమ కుటుంబంతో తమ వెంటే నడిచారన్నారు. బ్రహ్మపుత్రారెడ్డి అంత్యక్రియలకు నియోజకవర్గం వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, సన్నిహితులు, బంధువులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో నియోజకవర్గం సీనియర్ నాయకులు కంభం నిరంజన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పులి నరేంద్రరెడ్డి, నాయకులు రాజేంద్రాచారి, గాంధీపేట రమణ, కోనూరి పీవీ నారాయణ, మురళి, కువైట్ బాబు, సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్, కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ నిరు ద్యోగులకు 2024-25కు సంబంధించి రుణాలు మంజూరైనట్లు ఎంపీ డీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఋణాలు అవసరమైన నిరుద్యోగులు పూర్తి బయోడేటాతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఏప్రిల్ 14 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

చెత్త డంప్ తొలగింపు


చెత్త తొలగిస్తున్న కార్మికులు

పీలేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె మార్గంలోని ఈద్గాహ్ మైదానం వద్ద చెత్త డంప్‌ను శనివారం పీలేరు పంచాయతీ అధికారులు తొలగించారు. 'చెత్త డంప్‌పై స్థానికుల అభ్యంతరం' పేరిట ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ ఈవో గురుమోహన్ స్పందించారు. వెంటనే చెత్తను తొలగించే చర్యలు చేపట్టారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తుల కారణంగా అక్కడ డంప్ ఏర్పడిందని, అవగాహన రాహిత్యంతో కొంత మంది పంచాయతీ డ్రైవర్లు చెత్తను డంప్ చేశారని, ఇకపై అటువంటివి జరగకుండా చూ స్తామని ఆయన తెలిపారు.

ఆరో తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించాల్సిన పరీక్ష 21కి వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20న ఆదివారం ఈస్టర్ పండుగ ఉండటంతో పరీక్షను మరుసటి రోజుకు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 21న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

క్యూఎన్‌ఎక్స్, స్క్వేర్ టెక్నాలజీతో మిట్స్ ఎంవోయూ



క్యూఎన్‌ఎక్స్, స్క్వేర్ టెక్నాలజీతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎంబెడెడ్ సిస్టమ్స్, ఆటోమేటివ్ సాఫ్ట్‌వేర్‌లను ప్రోత్సహించడంలో భాగంగా క్యూఎన్‌ఎక్స్, స్క్వేర్ టెక్నాలజీతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. శనివారం కళాశాలలో ఆ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్స్‌తో పాటు, అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థుల ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు, పరిశోధనల ద్వారా విద్యార్థులకు విద్యామార్గాలను సుమగమం చేయడంతో పాటు, ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. కాగా సాంకేతిక చొరవతో ప్రతిభావంతమైన అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటుగా విద్యాసంస్థ, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ద్రుపద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్స్ విద్యార్థుల జయకేతనం


శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో జయకేతనం ఎగురవేశారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. ప్రథమ ఎంపీసీలో ఉమామహేశ్వర్ 465,, నిత్య శ్రీకళ్యాణి, లీనాశ్రీ 464, శ్రీకర్‌రెడ్డి 463, యామిని, పనుష్య, వాసవి, మానస 462, షామితరెడ్డి, యశ్విత 460 మార్కులు, బైపీసీలో జ్యోత్స్న 433, రక్షిత 426, దివ్య 422, ధన్యత, ప్రియదర్శిని 419 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్లో వన్షిక, మహ్మద్ ఇమ్రాన్ 987, నిఖిలేశ్వర్ 985, యుక్త 984, మహ్మద్ తాలిబ్, పోషిత 980 మార్కులు సాధించారు. వీరిని అడ్మినిస్ట్రేటివ్ సీఈఓ వాణిశ్రీ, అధ్యాపకులు అభినందించారు.

'జ్ఞానాంబిక' విజయ దుందుభి


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ పరీక్ష ఫలితాల్లో జ్ఞానాంబిక జూని యర్ కళాశాల వి ద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచా రని ఆ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ బైపీసీలో షేక్ సాజియా 440 మార్కులకుగాను 435 మార్కులు, కె.తస్నీయా 434 మార్కులు, ఎంపీసీలో ఎ. చందన 470 మార్కులకు 463, కె. హర్షవర్ధన్‌రెడ్డి 463, డి. రీతు 460 , ఎంఎస్ తన్వీర్ 460 మార్కులు, ఎంఈసీలో గాయత్రి 500 మార్కులకుగాను 488, షేక్ సయ్యద్‌బాషా 482మార్కులు, జూని యర్ సీఈసీలో పి, హర్షిత 468,బి, వసుంధర 463 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సి.రెడ్డిసాయి దర్శన్ 1000 మార్కులకు 985, బి. ఈశ్వరేంద్రీజీ 984, సీనియర్ బైపీసీలో షేక్ నజియా 977, షేక్ షాహినా 976, సీనియర్ ఎంఈసీలో కెఎన్ లక్ష్మీనరసింహ 979, జి.అమని 978, సీనియర్ సీఈసీలో ఎస్ వైష్ణవి 979, మొగల్ హర్ష్ బేగం 955 మార్కులు సాధించారని తెలిపా రు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, చిన్నా, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

శ్రీసిద్ధార్థ విద్యార్థుల ప్రభంజనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాల్లో మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీసిద్ధార్థ జూనియర్ కళా శాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంక టరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఆయా విద్యార్థులకు మిఠాయిలు తినిపించి అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్ తబస్సుమ్ 465 మార్కులు, ఎస్ నబీనా 464 మార్కులు, ఎస్ లక్ష్మీకుమార్‌రెడ్డి, జె. సాయిదీక్షిత 463 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో పి.దేదీప్యసాయి 987, బైపీసీలో ఎస్ రోహిణి 986 ఎ. మల్లికార్జున, బాలనాగహాసిని 985 పి.అల్మాస్, జి. మిథున్ హరిహరన్ 984 మార్కులు సాధించారు.

కృష్ణారెడ్డి కళాశాల ఉత్తమ ఫలితాలు


విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ ఎన్ కృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రశాంత్‌నగర్‌లోని కృష్ణారెడ్డి, పద్మావతి జూనియర్ కళాశాలలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి కేక్ కట్ చేయించి అభినందించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎ వెంకటసాయి దీపక్ 989, బైపీసీలో బి. హర్షిత 989, ఆర్ జాహ్నవి 986 మార్కులు , ఎంఈసీలో సాయి సుదీక్ష 984, ఎస్ సుఫియాన్ 984, కావ్యశ్రీ 983, జూనియర్ ఇంటర్ ఎంఈసీలో పి.లావణ్య 941, పి.మదన్‌మోహన్ 937 సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె. హషినీ 462, భారత్‌కుమార్ 461,మహతి, మధురాణి, జ్యోతిస్వరూపరెడ్డి, నిఖిల్ చక్ర 461, సీఈసీలో ప్రియా 477, ఎఎస్ మోక్షిత్ 459, ఎంఈసీలో పవిత్ర 445 మార్కులు సాధించారు.

'శ్రీ వికాస్' విద్యార్థుల విజయకేతనం


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివశంకర్

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థులు ప్రభజనం సృష్టించారని శ్రీ వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ తెలిపారు. సీనియర్ బైపీసీలో ఎస్ చైతన్య 989 , సయ్యద్ సోఫియా 971 సాధించారు. జూనియర్ ఎంపీసీలో స్టాన్లీ సెబాస్టియన్ 462, బైపీసీలో లిఖితశ్రీ 414, సీఈసీలో అబు హురేలా 469 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లి దండ్రులకు , శ్రేయోభిలాషులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చైతన్య కళాశాలలో..


యాస్మిన్, జి.ఈషా మెహరాజ్,కేతన

పీలేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున రెడ్డి తెలిపారు. సీని యర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఎస్.యాస్మిన్ 988, పూజిత 980, రెడ్డిలక్ష్మి 979, బైపీసీలో ఎం.రూపిక 973, జి.ఈషా 973, ఎ.షర్మిన్ 965, పి.గౌసియా 960, సీఈసీ గ్రూపులో జి.ఉష 962, పల్లవి 958, గిరీష్మా 957 మార్కులు సాధించారని ఆయన తెలి పారు. జూని యర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.రెడ్డిలోహిత 461, ఎన్. గురులహరి 452, హేమశ్రీ 450, బైపీసీలో సాదియా 427, హఫ్సా ఫిర్దోస్ 423, సీఈసీలో జోయా తస్లీమ్ 466, పద్మజ 456 మార్కులు సాధించా రని ఆయన తెలిపారు. శ్రీమేధ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లోకేశ్ బాబు తెలిపారు. సీనియర్ ఎంపీసీలో కేతన్ 986, మెహరాజ్ 980, నందిని 980, జూనియర్ ఎంపీసీలో వినూష్ 448, సంజన 442, జూనియర్ బైపీసీలో సనా షమీన్ 421, ఫాతిమా 398, జూని యర్ సీఈసీలో హరీశ్ 452, వీణాద్రి 438 మార్కులు సాధించారని ఆయన తెలిపారు.

శ్రీనివాస కళాశాలలో..


మెహతాజ్, ఆసిఫా, దివ్య, తేజస్విని

కలికిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) స్థానిక శ్రీనివాస కాలేజీలో సీనియర్ ఎంపీసీలో వి. హాసిని 985 మార్కులు, సి.మెహతాజ్ 982, బైపీసీలో ఎస్.ఆసిఫా 985, పి.దివ్య 971, సీఈసీలో మౌనిక 952, సఫియా 951 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో నితీష్ కుమార్ రెడ్డి 464,. పవన్‌తేజ్ 462, బైపీసీలో షబా నా 422, హేలా ముబీన్ 418, సీఈసీలో తేజస్విని 476, ఎస్.సల్మా 474 మార్కులు సాధించింది. ఆయా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

'మేము సైతం'కు అబ్దుల్ కలాం అవార్డు

పీలేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పీలేరుకు చెందిన 'మేము సైతం' స్వచ్ఛంద సేవా సంస్థను ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు లభించింది. బెంగళూరుకు చెందిన సోమయాజులు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చిత్తూరులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులకు అందజేశారు. కరోనా సమయంలో అందించిన విశిష్ట సేవలకుగాను ఈ అవార్డు అందజేసినట్లు వారు తెలిపారు. అవార్డు అందుకున్న 'మేము సైతం' సభ్యులు షేక్ షాహిన్‌షా, హసన్ బాషా, బుజ్జు, షాజహాన్, రాజేశ్, జావిద్, రిజ్వాన్, సుహేల్, సయ్యద్ ఖాన్‌లను శనివారం పీలేరులోని పలువురు అభినందించారు.